'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 19 | గురువారం | 3.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 19 | Thursday | 3.9.2026 | Pages: 8 | Rate: 2



## ప్రతీకారంతో భగ్గుమన్న ఏబీవీ!

**లోకేశ్... నా ప్రశ్నలకు జవాబులేవి?**

కొన్ని మాటలు బుల్లెట్ల కంటే బలంగా తాకుతాయి. బుల్లెట్ తగిలితే ప్రాణం మాత్రమే పోతుంది. కానీ కొన్నిసార్లు కొన్ని మాటలు అంతకు మించి.. శరీరాన్ని తునాతునకలు చేస్తాయి. తాజాగా రిటైర్డ్ పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయ్. ఇంతకీ ఆయన ఏమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు తనయుడు నారా లోకేశ్ నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై ఆయన వ్యాఖ్యలను ఓ సారి చూద్దాం.. అమరావతిని నిర్మించడానికి ఆస్తి హక్కు గల వాళ్లకి ఇవ్వాల్సిన కాంపెన్సేషన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? సీఆర్‌డీఏకి లేదా? గుంటూరు కలెక్టర్‌కి లేదా? అబ్బే.. ఎవరు పలకట్లే." ఇది లోకేశ్ నియోజకవర్గంలో జరుగుతున్న తంతు. నా ఆస్తి ఎవడో ఎత్తుకుపోయి, అది మళ్లీ వెనక్కి తెచ్చుకోవడానికి నేను మళ్లీ డబ్బులు ఖర్చు పెట్టుకోవాలా? ఇదేనా న్యాయం? ఇదేనా పరిపాలనంటే?" .. "నాయకులు, ఈ అధికారులు అంటారంట.. లేదండి మీ సమస్యను సాల్వ్ చేసి, లోకేశ్‌కి చిత్రపటానికి క్షీరాభిషేకం చేద్దామని అంటారు. మా ఆస్తి దొబ్బేసి, మీరు కాళ్లు అరిగేలాగా, చెప్పులు అరిగేలాగా తిరిగితే, ఏ హైకోర్టు మొట్టికాయ వేసింది అని చెప్పి, దిక్కులేక మా ఆస్తి మాకు అప్పజెప్పి మళ్లీ మీకు క్షీరాభిషేకం చేయమంటారా?"... "90 వేల మెజారిటీతో ప్రజలే ఓట్లాభిషేకం చేశారు" "రోజూ నోట్లతో నోట్లాభిషేకం చేసుకుంటానే ఉన్నారు. మళ్లీ పాలాభిషేకానికి, పాల ఫ్యాక్టరీలకి అంత కరువు వచ్చి పడ్డారా మీరు. మీకు పాలాభిషేకం కావాలా?" "సిగ్గుచేటు.. సిగ్గుపడాలి" "మా ఆస్తి తొక్కి పట్టి, మీరు రెండేళ్ల నుంచి మీరు వచ్చిన తర్వాత కూడా, తిప్పి తిప్పి చంపి, ఇవ్వాల మీకు క్షీరాభిషేకం, పాలాభిషేకాలు చేయాలా మీ ఫోటోలకి. సిగ్గుచేటు, సిగ్గుపడాలి ఈ పరిపాలనలో."



# సస్పెన్షన్ పై సస్పెన్స్

## తీసేస్తే తిరకాసు.. వదిలేస్తే అభాసు

**మిస్టరీగా మారిన మినిస్టర్ పోస్ట్**

**కాంగ్రెస్ హైకమాండ్‌లో అంతర్మథనం**

**తీసివేతలా.. కూడికలా.. రేవంత్ వ్యూహమేంటి?**

తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు కీలక మలుపుగా మారింది. కొండా సురేఖ ఢిల్లీ వెళ్లడం, పార్టీ పెద్దలను కలవడం, హైకమాండ్ నిర్ణయం కోసం ఎదురుచూస్తామని చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలోనే ఉండి పార్టీ పెద్దలతో వరుసగా మంతనాలు సాగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించినా ప్రభుత్వానికి, పార్టీకి పెద్దగా ఇబ్బంది ఉండదనే సంకేతాలు వెళ్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే అదే సమయంలో బీసీ సామాజిక సమీకరణానికి నష్టం రాకుండా ముగ్గురు మహిళలకు కీలక పదవులు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది.

(వివరాలు 2లో..)



## నాపై ఆరోపణలు చేసిందెవరో తెలుసు

» బీసీకో న్యాయం.. ఇతరులకో న్యాయమా?
» సీఎం రేవంత్‌పై డైరెక్ట్ ఎటాకా?
» ఏదో ఒక డిసిషన్ తీసుకోండి
» ఆ తర్వాత నేనేం చేయాలో ఆలోచిస్తా
» షోకాజ్‌పై తీవ్ర సురేఖ అభ్యంతరం
» ఢిల్లీ పెద్దలకు పరకాల డైనమైట్ క్లారిటీ
» హైకమాండ్‌పైనే కొండంత భారం

మాజీ మంత్రి కొండా సురేఖ ఢిల్లీ పర్యటనలో కాంగ్రెస్ అధిష్టాన పెద్దలను కలిసి తన వాదనను స్పష్టంగా వినిపించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయి, తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసుపై వివరణ ఇచ్చినట్లు తెలిపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సరికాదని సురేఖ స్పష్టం చేశారు. "నా కుమార్తెకు పెళ్లయింది. (వివరాలు 2లో..)



**కాంగ్రెస్‌ను కబ్జా కానివ్వను**

**రాజగోపాల్ అడ్డుగోడగా నిలుస్తాడు**

## టైమొస్తే.. సీఎం అవుతా

7లో..

### బ్రహ్మదేవుడూ ఆపలేడు

**రియల్ కాంగ్రెస్‌పై కొత్తవాళ్ల పెత్తనం సహించం!**

**కాంగ్రెస్ రక్తమే.. వైఎస్సార్ స్ఫూర్తే మా బలం**

**కుట్రలెన్ని చేసినా.. హస్తాన్ని వదిలేది లేదన్న రాజన్న**

కాంగ్రెస్ పార్టీని ఎవరూ కబ్జా చేయలేరంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త మంట రాజేశాయా? అసలు పార్టీలోకి వచ్చిన కొత్త నేతల పెత్తనంపై ఆయన ఎందుకు ఇంత ఘాటుగా స్పందించారు? పదేళ్ల పాటు కాంగ్రెస్ కోసం పోరాడిన అసలు కార్యకర్తలకు ఇప్పుడు ఎందుకు అన్యాయం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు? "మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే వెళ్లగొడతామంటే ఊరుకోం" అంటూ ఆయన చేసిన హెచ్చరిక వెనుక ఎవరున్నారు? తన రాజకీయ భవిష్యత్తుపై కూడా రాజగోపాల్ రెడ్డి ఎందుకు ఇంత ధీమాగా మాట్లాడారు? "నేను సీఎం అయ్యే టైమ్ వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు" అన్న వ్యాఖ్య కేవలం ఆత్మవిశ్వాసమా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ముందస్తు సంకేతమా? వైఎస్సార్‌ను గురువుగా, అభిమానిగా చెప్పుకుంటూ "తెలంగాణలో మళ్లీ రాజశేఖరరెడ్డి యుగం వస్తుంది" అన్న ఆయన మాటల వెనుక అసలు రాజకీయ వ్యూహమేంటి? కాంగ్రెస్‌లో తన స్థానం కోసం రాజగోపాల్ రెడ్డి మొదలుపెట్టిన ఈ పోరాటం ఎక్కడికి దారితీయబోతోంది? ప్రత్యేక కథనం



## సురేఖ వ్యవహారంపై ఖర్గేతో చర్చలు

**ఏఐసీసీ చీఫ్‌తో రేవంత్, భట్టి భేటీ**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో కలిశారు. రాష్ట్ర రాజకీయాలు, పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలపై ఈ సమావేశంలో కీలక చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా మంత్రి కొండా సురేఖ వ్యవహారం, కేబినెట్ విస్తరణ అంశాలు ఖర్గే దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో హైకమాండ్ నిర్ణయం కోసం తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది. భేటీ అనంతరం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు ఖర్గే కారులోనే వైఎస్ఆర్ అవార్డుల కార్యక్రమానికి వెళ్లారు.

## వైఎస్సార్ నివాళిలో నిగూఢార్థం

**రాహుల్‌ను ప్రధానిని చేయడమే పరమార్థం**



ఢిల్లీలో జరిగిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవార్డ్స్ 2026 కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కాంగ్రెస్ శ్రేణులు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన ముందుచూపుతో దేశం ఆకలి కేకల నుంచి ఆహార ఎగుమతులు చేసే స్థాయికి చేరిందని అన్నారు. రైతులు పండించే పంటకు మద్దతు ధర అందించే వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని చెప్పారు. పేదలకు అసైన్డ్ భూములు పంపిణీ చేయడం, పీడీఎస్ ద్వారా రేషన్ సరుకులు అందించడం వంటి చర్యలు కాంగ్రెస్ పాలనలోనే జరిగాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. (వివరాలు 2లో..)

## రక్షణ రంగంపై తెలంగాణ భారీ ఫోకస్!




**రక్షా ఎక్స్‌పోకు రాజ్‌నాథ్‌కు ఆహ్వానం**

**డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సు**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిశారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు హాజరై.. అందులో భాగంగా నిర్వహించనున్న రక్షా ఎక్స్‌పో2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆహ్వానించారు. తెలంగాణలో రక్షణ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు ఈ సదస్సును వేదికగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. (వివరాలు 2లో..)



## వెయ్యి రోజులు.. వెయ్యి రోజుల ప్రజా పీడన

» అబద్ధాలు.. అవినీతి.. అరాచకమే పాలన

» కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ సహా పలువురు బీఆర్ఎస్ నేతల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదని, "వెయ్యి రోజుల పాలన కాదు.. వెయ్యి రోజుల ప్రజా పీడన" అని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. అబద్ధం, అరాచకం, అజ్ఞానం, అవినీతి నాలుగు పడగలతో కాంగ్రెస్ పాలన సాగుతోందని మండిపడ్డారు. రైతులు, నిరుద్యోగులు, దళితులు, బహుజనులు, మైనారిటీలు, మహిళలు ఇలా ప్రతి వర్గం మోసపోయిందని విమర్శించారు. వెయ్యి రోజుల్లో రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసినా కొత్తగా ఒక్క పెద్ద నిర్మాణం చేపట్టలేదని, గత ప్రభుత్వం పూర్తి చేసిన పనులకు మాత్రమే రిబ్బన్ కటింగులు చేస్తున్నారని ఆరోపించారు. (వివరాలు 2లో..)

### రాష్ట్రం కుప్పకూలింది

**ఆరు గ్యారంటీల పేరుతో మోసం**

**కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు ఫైర్**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో జరిగిన అరాచకాలు, వ్యవస్థల నిర్వీర్యం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వైఫల్యాలను ప్రజల ముందు ఉంచేందుకే ఛార్జ్‌షీట్ విడుదల చేస్తున్నామని తెలిపారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ జోష్..

**గాంధీభవన్‌లో ఘనంగా సంబరాలు**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తైన సందర్భంగా గాంధీభవన్‌లో పార్టీ నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. "విధ్వంసం నుంచి వికాసం వైపు.. 1000 రోజుల ప్రజాపాలన" నినాదంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను నేతలు వివరించారు. (వివరాలు 2లో..)

## మీ డబ్బు మూలం ఏంటో చెప్పండి

**బీఆర్ఎస్ సంపదపై పొంగులేటి ఆరోపణలు**



మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని డబ్బులు మీ పార్టీకున్నాయి.. ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?" అంటూ బీఆర్ఎస్‌ను నేరుగా ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి ఇంత భారీగా డబ్బు ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. (వివరాలు 2లో..)



## తప్పు ఎవరిది.. శిక్ష ఎవరికి?

**రూ.22 వేల కోట్లకు రూ.6.5 కోట్లు!**

**పెద్దలకు రుణరాజ్యం.. సామాన్యులకు శిక్షలా?**

6లో..

**ఒకే దేశం.. రెండు రకాల రుణ న్యాయం**

పెద్ద రుణాలకు భారీ మినహాయింపులు.. సామాన్యుడికి మాత్రం వడ్డీ పోటు! దేశం ఇప్పుడు ఒకే ప్రశ్న అడుగుతోంది.. తప్పు ఎవరిది.. శిక్ష ఎవరికి? వేల కోట్ల రుణాలు తీసుకున్న పెద్ద వ్యాపార సామ్రాజ్యాలు కుప్పకూలితే దివాలా చట్టాలు, రుణ పరిష్కారాలు, సెటిల్‌మెంట్లు తెరపైకి వస్తాయి. కోట్ల రూపాయల క్లెయిమ్‌ల మధ్య అతి స్వల్ప మొత్తంతో పరిష్కార ప్రతిపాదనలు కనిపిస్తాయి. కానీ అదే దేశంలో ఒక రైతు లక్ష రూపాయల రుణం చెల్లించలేకపోతే బ్యాంకు నోటీసు అతని ఇంటి తలుపు తడుతుంది. చిన్న వ్యాపారి ఐదు లక్షల అప్పు తీసుకుని వ్యాపారం దెబ్బతింటే వడ్డీ మీద వడ్డీ భారం పెరుగుతుంది. పెద్దవాడికి చట్టం అండగా కనిపిస్తే.. చిన్నవాడికి చట్టం ఎందుకు భారంగా మారాలి? ఇదే ఇప్పుడు దేశం ముందున్న అసలు ప్రశ్న. సుభాష్ చంద్రకు సంబంధించిన దివాలా పరిష్కార వ్యవహారం ఈ చర్చకు కొత్త మంట రాజేసింది. రూ.22 వేల కోట్లకు పైగా రుణదాతల క్లెయిమ్‌ల మధ్య రూ.6.5 కోట్ల చెల్లింపు ప్రతిపాదన రావడం సామాన్యుల్లో అనేక సందేహాలు రేకెత్తించింది. దీనిపై విజయ్ మాల్యా చేసిన వ్యాఖ్యలు మరోసారి బ్యాంకుల రికవరీ లెక్కలపై ప్రశ్నలు లేవనెత్తాయి. రుణం ఇచ్చింది ఎవరి డబ్బుతో? నష్టం వస్తే భరించేది ఎవరు? సెటిల్‌మెంట్ ప్రయోజనం పొందేది ఎవరు? ఇది ఒక్క వ్యక్తి కథ కాదు. ఇది దేశ బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకానికి సంబంధించిన ప్రశ్న. నిజంగా తప్పు చేసినవారికి శిక్ష పడాలి.. నిజాయితీగా విఫలమైనవారికి అవకాశం రావాలి.. కానీ ప్రజల డబ్బుకు మాత్రం లెక్క చెప్పాల్సిందే.

## 22A భూములపై బీజేపీ సమరశంఖం

**నర్సాపూర్‌లో ముగ్గురు ఎంపీల పోరుబాట**

**అన్నదమ్ములు దోచుకుంటున్నారు**

**మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫైర్**



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో 22A నిషేధిత భూముల జాబితాను వ్యతిరేకిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావుతో పాటు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ పాలనలో తండ్రి, కొడుకు, కూతురు, మేనల్లుడు కలిసి తెలంగాణను దోచుకున్నారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్నదమ్ములు దోచుకుంటున్నారని ఆరోపించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ కలిసి దొంగ పోలీస్ ఆట ఆడుతున్నాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క బీఆర్ఎస్ నాయకుడినైనా అరెస్ట్ చేసిందా అని ప్రశ్నించారు. ధరణి, భూ భారతి పేర్లు మార్చడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని రఘునందన్ రావు విమర్శించారు.




## కోట్లకు చేరిన కూకట్‌పల్లి భూములు

**కేపీహెచ్‌బీలో గజం రూ.2.70 లక్షలు**

**ఒక్క వేలంలో బోర్డుకు రూ.47.14 కోట్లు**

### నా జోలికి రావొద్దు.. నన్ను కెలకొద్దు

- ఐదుగురు సభ్యుల బెంచ్‌పై పోరాటం
- ట్రిబ్యునల్‌లో సుభాష్‌చంద్ర వాదనలు
- ఎన్‌సీఎల్‌టీ అధికారంపై అభ్యంతరం

# సస్పెన్షన్ పై సస్పెన్స

- తీసేస్తే తిరకాసు.. వదిలేస్తే అభాసు
- మిస్టరీగా మారిన మినిస్టర్ పోస్ట్
- కాంగ్రెస్ హైకమాండ్‌లో అంతర్మథనం
- తీసివేతలా.. కూడికలా.. రేవంత్ వ్యూహమేంటి?

తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు కీలక మలుపుగా మారింది. కొండా సురేఖ ఢిల్లీ వెళ్లడం, పార్టీ పెద్దలను కలవడం, హైకమాండ్ నిర్ణయం కోసం ఎదురుచూస్తామని చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలోనే ఉండి పార్టీ పెద్దలతో వరుసగా మంతనాలు సాగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించినా ప్రభుత్వానికి, పార్టీకి పెద్దగా ఇబ్బంది ఉండదనే సంకేతాలు వెళ్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే అదే సమయంలో బీసీ సామాజిక సమీకరణానికి నష్టం రాకుండా ముగ్గురు మహిళలకు కీలక పదవులు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది.

### మంత్రి వర్గ విస్తరణపైనా మల్లగుల్లాలు

సురేఖపై నిర్ణయం తీసుకునే క్రమంలో మంత్రి వర్గ విస్తరణ అంశం కూడా కీలకంగా మారింది. ఇప్పుడే విస్తరణ చేయాలా? కొంతకాలం వేచి చూడాలా? తీసివేతలతో పాటు కొత్తగా ఎవరిని చేర్చాలి? అన్న లెక్కల్లో కాంగ్రెస్ నాయకత్వం తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. ఒక అడుగు ముందుకు.. మరో అడుగు వెనక్కి అన్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది. సురేఖను రాజీనామా చేయాలని కోరే ముందు హైకమాండ్ కొన్ని వ్యూహాత్మక అడుగులు వేయొచ్చనే ప్రచారం జరుగుతోంది. నేరుగా విమర్శలు, ఆరోపణలు చేయకుండా పరిస్థితిని సానుకూలంగా చక్కదిద్దే ప్రయత్నం జరగొచ్చన్న అంచనాలు ఉన్నాయి. సురేఖను ఒప్పించడమే అసలు సవాల్‌గా మారినట్టు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



### సురేఖ లొంగుతారా.. సీన్ మారుతుందా?

అయితే కొండా సురేఖ అంత తేలిగ్గా వెనక్కి తగ్గే నాయకురాలు కాదనే అభిప్రాయం కాంగ్రెస్‌లోనే ఉంది. ఆమెపై ఒత్తిడి పెరిగితే పరిణామాలు మరో దిశలోకి వెళ్లే అవకాశం ఉందన్న ఆందోళన కూడా ఉంది. నాడు జగన్.. ఆ తర్వాత బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ అయినా లెక్క ఒక్కటేనన్న సందేశం సురేఖ వైఖరిలో కనిపిస్తోందన్న చర్చ జరుగుతోంది. అందుకే ఆమెను నేరుగా ఢీకొనకుండా, సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని, పార్టీ భవిష్యత్ ప్రయోజనాలను లెక్కలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారం కేవలం ఒక మంత్రి భవిష్యత్ ప్రశ్నగా కాకుండా.. తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత సమీకరణాలు, బీసీ రాజకీయాలు, మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణకు పరీక్షగా మారింది.

# నాపై ఆరోపణలు చేసిందెవరో తెలుసు

- బీసీకో న్యాయం.. ఇతరులకో న్యాయమా?
- సీఎం రేవంత్‌పై డైరెక్ట్ ఎటాకా?
- ఏదో ఒక డిసిషన్ తీసుకోండి
- ఆ తర్వాత నేనేం చేయాలో ఆలోచిస్తా
- షోకాజ్‌పై తీవ్ర సురేఖ అభ్యంతరం
- ఢిల్లీ పెద్దలకు పరకాల డైనమైట్ క్లారిటీ
- హైకమాండ్‌పైనే కొండంత భారం

మాజీ మంత్రి కొండా సురేఖ ఢిల్లీ పర్యటనలో కాంగ్రెస్ అధిష్టాన పెద్దలను కలిసి తన వాదనను స్పష్టంగా వినిపించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయి, తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసుపై వివరణ ఇచ్చినట్లు తెలిపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సరికాదని సురేఖ స్పష్టం చేశారు. "నా కుమార్తెకు పెళ్లయింది. ఆమె స్వతంత్ర వ్యక్తి. తన అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఆమెకు ఉంది. ఆమెను మాట్లాడవద్దని చెప్పే అధికారం నాకు లేదు" అని పేర్కొన్నారు. మహిళలు స్వతంత్రంగా మాట్లాడాలని రాహుల్ గాంధీ చెబుతున్న సందర్భంలో, తన కుమార్తె కూడా స్వతంత్రంగా మాట్లాడిందన్నది తన అభిప్రాయమని చెప్పారు. అయితే కుమార్తె ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలను తాను సమర్థించనూ లేదు, ఖండించనూ లేదు అని స్పష్టం చేశారు.

### తనపై కుట్ర జరిగిందన్న ఆరోపణ

తనపై ఫిర్యాదులు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సురేఖ కోరారు. తన తప్పు లేకుండా తనను లక్ష్యంగా చేసుకుని కొందరితో మాట్లాడించారని ఆరోపించారు. "ఎవరు వెనుక ఉండి మాట్లాడించారో మాకు తెలుసు. పేర్లు చెబితే వివాదం అవుతుంది" అని అన్నారు. కొందరు తర్వాత ఫోన్ చేసి, తమకు ఇష్టం లేకపోయినా పిలిచినందుకు వెళ్లి మాట్లాడాల్సి వచ్చిందని చెప్పారని సురేఖ వెల్లడించారు. తనపై జరిగిన పరిణామాల వెనుక ఉన్న అంశాలను పార్టీ కూడా పరిశీలించాలని కోరారు. తనకు షోకాజ్ ఇవ్వడమే తప్పని, తాను ఏఐసీసీ సభ్యురాలినని చెప్పారు. తనపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఏఐసీసీ స్థాయిలోనే నిర్ణయం తీసుకోవాలి అని స్పష్టం చేశారు.



### మంత్రి పదవిపై సురేఖ కీలక విజ్ఞప్తి

తాను మంత్రిగా ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా బాధ్యతలు నిర్వహించానని సురేఖ తెలిపారు. ప్రజలకు మరింత సేవ చేయాలన్న ఆలోచనతో ఉన్నానని చెప్పారు. తనను మంత్రి పదవిలో కొనసాగించాలని ఖర్గే, మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశానని వెల్లడించారు. వారు తన వాదన విన్నారని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని తెలిపారు. సోనియా గాంధీ, ప్రియాంక గాంధీకి కూడా తన వివరణను పంపినట్లు చెప్పారు. ఖర్గేకు, కేసీ వేణుగోపాల్‌కు తన లేఖలు, వివరాలు అందించినట్లు వెల్లడించారు. పార్టీ భవిష్యత్ నిర్ణయం ఏంటనేది తనకు తెలియదని, పార్టీ తనను ఏం అడుగుతుందో దాని ఆధారంగానే తన తదుపరి ఆలోచన ఉంటుందని సురేఖ స్పష్టం చేశారు. మొత్తంగా తన కుమార్తె వ్యాఖ్యలకు తాను బాధ్యత వహించబోనని, తనపై వచ్చిన ఫిర్యాదుల వెనుక ఉన్న కుట్రను పార్టీ పరిశీలించాలని, తన రాజకీయ భవిష్యత్తుపై తుది నిర్ణయం అధిష్టానమే తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ జోష్..

### గాంధీభవన్‌లో ఘనంగా సంబరాలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తైన సందర్భంగా గాంధీభవన్‌లో పార్టీ నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. "విధ్వంసం నుంచి వికాసం వైపు.. 1000 రోజుల ప్రజాపాలన" నినాదంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను నేతలు వివరించారు. ఆహార భద్రత, సామాజిక భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. 15 లక్షలకుపైగా కొత్త రేషన్ కార్డులు, 3.38 కోట్ల మందికి ఆహార భద్రత, సన్నబియ్యం పంపిణీ, కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు అందించామని తెలిపారు. మొత్తంగా 43 లక్షలకుపైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని వెల్లడించారు.

### రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్యం

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందని నేతలు పేర్కొన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీతో 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు లబ్ధి, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం అందించామని తెలిపారు. సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయం, రైతు సంక్షేమానికి ఇప్పటివరకు రూ.1.68 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

### బీఆర్ఎస్‌పై జగ్గారెడ్డి ఫైర్

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలు నిర్బంధ వాతావరణంలో గడిపారని, స్వేచ్ఛ కావాలనే ఆకాంక్షతోనే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పోలీసుల నిర్బంధాలు లేవని, మీడియాపై ఆంక్షలు విధించలేదని, ప్రజలు సచివాలయానికి స్వేచ్ఛగా వెళ్లే వాతావరణం కల్పించామని పేర్కొన్నారు.



### 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేకపోయిందని జగ్గారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, రేషన్ కార్డులు ఇచ్చిందని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచిందని తెలిపారు. తెలంగాణ కోసం వందలాది మంది విద్యార్థులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేస్తూ, రాష్ట్రాన్ని తామే సాధించామని చెప్పుకునే కేసీఆర్ కుటుంబంలో తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసిన ఒక్కరినైనా చూపించాలని ప్రశ్నించారు.

### కేసీఆర్ కుటుంబాన్ని లైట్ తీసుకున్నాం

కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదని జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్ రాజీనామా చేసినా, కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబంలోని ముగ్గురు అసెంబ్లీకి రాకపోయినా ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని వ్యాఖ్యానించారు. "కేసీఆర్ అండ్ ఫ్యామిలీని కాంగ్రెస్ ఎప్పుడో లైట్ తీసుకుంది" అని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌పై విమర్శలు చేసే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని, విద్యార్థుల త్యాగాలను తన ఖాతాలో వేసుకోవద్దని సూచించారు.

# వైఎస్సార్ నివాళిలో నిగూడార్థం

## రాహుల్‌ను ప్రధానిని చేయడమే పరమార్థం



### రైతు గుండెల్లో వైఎస్ స్థానం

దేశంలోని ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించేందుకు సోనియా గాంధీ హయాంలో ఆహార భద్రత చట్టం తీసుకొచ్చారని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం 3 కోట్ల 48 లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామంటే, గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సంక్షేమ వ్యవస్థలే కారణమని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసిన నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని గుర్తుచేశారు. అప్పట్లో ₹1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేసి, రైతులపై ఉన్న కేసులను ఎత్తివేసి ఆయన రైతుల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. తెలంగాణకు సాగునీరు అందించేందుకు ప్రాణహితచేవెళ్ల, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వంటి ప్రాజెక్టులకు వైఎస్ శ్రీకారం చుట్టారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### ఆ కోరిక నెరవేర్చడమే నివాళి

వైఎస్ ప్రారంభించిన ప్రాణహితచేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ పనులు ప్రస్తుతం ఆగిపోయాయని రేవంత్ రెడ్డి అన్నారు. వైఎస్ ఆశయాలను నూటికి నూరు శాతం కొనసాగిస్తామని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ అభిమానులకు ఆయన కీలక సందేశం ఇచ్చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తన జీవిత లక్ష్యమని చెప్పారని, ఆ కోరిక నెరవేరకుండానే ఆయన మరణించారని గుర్తుచేశారు. దేశ ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో నాయకుడు వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి బలమైన నాయకుడు రాహుల్ గాంధీ అని, ఆయనను ప్రధానమంత్రిని చేయడమే వైఎస్‌కు నిజమైన నివాళి అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు వైఎస్ అభిమానులు మద్దతు ఇవ్వాలని కోరారు. మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులంతా కలసి పనిచేసి రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని పిలుపునిచ్చారు.




# వెయ్యి రోజులు.. వెయ్యి రోజుల ప్రజా పీడన

- అబద్దాలు.. అవినీతి.. అరాచకమే పాలన
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్

### రైతు.. నిరుద్యోగి.. పేదలపై తీవ్ర ఆరోపణలు

రైతులకు రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి చివరకు రూ.20 వేల కోట్లకే పరిమితం చేశారని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు సక్రమంగా అందడం లేదని, రైతుబీమాను నిర్వీర్యం చేశారని, బోనస్ పేరుతో బోగస్ చేశారని విమర్శించారు. యూరియా కోసం రైతులు క్యూల్లో నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందని, ధాన్యం కొనుగోళ్ల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారని అన్నారు. వెయ్యి రోజుల్లో వెయ్యికి పైగా రైతు ఆత్మహత్యలు జరిగాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని, నీళ్లున్నా ఎత్తిపోసే పరిస్థితి లేకుండా చేశారని మండిపడ్డారు. ఇక నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతపై లాఠీచార్జీలు జరిగాయని, జాబ్ క్యాలెండర్ హామీ కూడా అమలు కాలేదని ఆరోపించారు. సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో యువత పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ ప్రకటించారు.

### మహిళలు.. విద్యార్థులు.. బీసీలకు అన్యాయం

కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఉన్న నగదు సాయం కూడా సక్రమంగా అందించలేని పరిస్థితి తీసుకొచ్చారని కేటీఆర్ విమర్శించారు. 1.67 కోట్ల మంది మహిళలు నెలకు రూ.2,500 కోసం ఎదురుచూస్తున్నారని, ఒక్కో మహిళకు రూ.80 వేల వరకు బకాయి పడ్డారని ఆరోపించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు వేతనాల కోసం ఆందోళన చేస్తే వారిపై చర్యలు తీసుకున్నారని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదని, గురుకులాల్లో ఆహార నాణ్యత దారుణంగా ఉందని ఆరోపించారు. యూనివర్సిటీ భూముల విషయంలోనూ ప్రభుత్వం వివాదాలకు కారణమవుతోందని అన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. బీసీ కార్పొరేషన్‌కు కేవలం రూ.74 కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.99 లక్షలు మాత్రమే ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. మొత్తంగా కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ప్రతి రంగం పతనమైందని, ప్రజల్లో తీవ్ర ఆగ్రహం ఉందని పేర్కొంటూ బీఆర్ఎస్ తరఫున ఈ ఛార్జ్‌షీట్‌ను ప్రజల ముందు ఉంచారు.

# 22A భూములపై బీజేపీ సమరశంఖం

- నర్సాపూర్‌లో ముగ్గురు ఎంపీల పోరుబాట
- అన్నదమ్ములు దోచుకుంటున్నారు
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫైర్

### ఈటల రాజేందర్ - పేదల భూములపై పోరాటం

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణలో భూముల వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. కేసీఆర్ కుటుంబంలో నలుగురు కలిసి తెలంగాణను దోచుకున్నారని, రేవంత్ రెడ్డి కుటుంబంలో ఏడుగురు ఉన్నారని ఆయన ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించినట్లే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి రాకుండా ముందే జాగ్రత్త పడాలని సూచించారు. పేదల భూములపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఉన్న రేవంత్ రెడ్డి పేదల భూములు కొల్లగొట్టడంలో రీసెర్చ్ స్కాలర్‌గా మారారని ఈటల ఘాటు వ్యాఖ్యలు చేశారు. 22A నిషేధిత భూముల అంశంపై ప్రజలకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి - రాజీనామాలకు డిమాండ్

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి 22A నిషేధిత భూముల జాబితాలో జరిగిన తప్పిదాలకు బాధ్యత వహిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ధరణి సమస్యలకు పరిష్కారంగా తీసుకొచ్చిన భూ భారతి మరింత అధ్వాన్నంగా తయారైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులతో కుమ్మక్కై లక్షల ఎకరాల భూములను కాజేస్తోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. నర్సాపూర్‌లో 22A భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. ముగ్గురు ఎంపీలు ఒకే వేదికపై ప్రభుత్వ భూ విధానాలను తీవ్రంగా ప్రశ్నించడంతో నర్సాపూర్ మహాధర్నా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



# మీ డబ్బు మూలం ఏంటో చెప్పండి

## బీఆర్ఎస్ సంపదపై పొంగులేటి ఆరోపణలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని డబ్బులు మీ పార్టీకున్నాయి.. ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?" అంటూ బీఆర్ఎస్‌ను నేరుగా ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి ఇంత భారీగా డబ్బు ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. "ఏం వ్యాపారం చేస్తే మీ కుటుంబానికి అంత డబ్బు వచ్చింది?" అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల సొత్తును కొల్లగొట్టలేదా అని హరీశ్‌రావును ఉద్దేశించి నిలదీశారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపదను దుర్వినియోగం చేశారన్నది తమ ఆరోపణ అని మంత్రి స్పష్టం చేశారు.

### 3,475 రోజుల పాలనపై నిలదీత

బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను సుమారు 3,475 రోజులు పాలించి భారీ అప్పుల భారం మోపి వెళ్లిందని పొంగులేటి ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అప్పులకు అసలు, వడ్డీ చెల్లించడంతో పాటు గత పాలనలో పెండింగ్‌లో పెట్టిన బిల్లులను చెల్లిస్తోందని తెలిపారు. సర్పంచులు, కాంట్రాక్టర్లు, అభివృద్ధి పనులు చేసిన వారికి చెల్లించాల్సిన బకాయిలను కూడా తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. "పనులు చేయించి బిల్లులు చెల్లించకుండా వదిలింది ఎవరు? ఇప్పుడు ఆ బకాయిలను చెల్లిస్తున్నది ఎవరు? ప్రజలకు అన్నీ తెలుసు" అని వ్యాఖ్యానించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనను విమర్శించే ముందు బీఆర్ఎస్ చేసిన పనులను గుర్తు చేసుకోవాలని సూచించారు.

### ధనిక రాష్ట్రంలో పేదలకు ఏం చేశారు?

బీఆర్ఎస్ పాలనపై ప్రశ్నలు సంధిస్తూ పొంగులేటి పలు అంశాలను ప్రస్తావించారు. "ధనిక రాష్ట్రంగా ఉన్నప్పుడు పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న ఆలోచన ఎందుకు చేయలేదు?" అని ప్రశ్నించారు. పేదలకు సన్న బియ్యం ఇవ్వడం, కనీసం అర్హులకు రేషన్ కార్డులు అందించడం వంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని నిలదీశారు. భద్రాచలం రాములవారి ఆలయం, పట్టణ అభివృద్ధికి రూ.1,000 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 3,475 రోజుల పాలనకు, కాంగ్రెస్ 1,000 రోజుల పాలనకు తేడాను ప్రజలు గమనిస్తున్నారని పొంగులేటి పేర్కొన్నారు.



# వెయ్యి రోజుల్లో రాష్ట్రం కుప్పకూలింది

## ఆరు గ్యారంటీల పేరుతో మోసం

- కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు ఫైర్

ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలకు బాండ్ పేపర్లు రాసిచ్చి, వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చిత్తశుద్ధి చూపడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు.

### అభివృద్ధి నుంచి తిరోగమనంలోకి

తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం "కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి" మాదిరిగా బలమైన స్థితిలో అప్పగించిందని హరీశ్‌రావు అన్నారు. అప్పటికే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఆ పురోగతిని మరింత వేగవంతం చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేసి కుప్పకూల్చిందని తీవ్రంగా విమర్శించారు. పురోగమనం వైపు వేగంగా ప్రయాణించాల్సిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం తిరోగమనం వైపు నడిపిస్తోందని ఆరోపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాల్సిన ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఎదురైన ఇబ్బందులు, ప్రభుత్వ వైఫల్యాలు, వ్యవస్థల నిర్వీర్యతను ఛార్జ్‌షీట్‌లో వివరించి ప్రజల ముందుంచుతున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# కోట్లకు చేరిన కూకట్‌పల్లి భూములు

- కేపీహెచ్‌బీలో గజం రూ.2.70 లక్షలు
- ఒక్క వేలంలో బోర్డుకు రూ.47.14 కోట్లు

### 19 మంది బిడ్డర్ల పోటీ

వేలం ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పీ. గౌతం తెలిపారు. తమకు నచ్చిన ప్లాట్లను దక్కించుకునేందుకు మొత్తం 19 మంది బిడ్డర్లు పోటీ పడ్డారు. దీంతో ఒక్కో ప్లాట్‌కు డిమాండ్ పెరిగి ధరలు గణనీయంగా నమోదయ్యాయి. బుధవారం జరిగిన వేలంలో చదరపు గజం సగటు ధర సుమారు రూ.1.79 లక్షలు పలికినట్లు గౌతం వెల్లడించారు. ఈ బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కేపీహెచ్‌బీ వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో భూమికి ఉన్న డిమాండ్ మరోసారి ఈ వేలం ద్వారా స్పష్టమైందని అధికారులు చెబుతున్నారు.

## నా జోలికి రావొద్దు..
# నన్ను కెలకొద్దు

- ఐదుగురు సభ్యుల బెంచ్‌పై పోరాటం
- ట్రిబ్యునల్‌లో సుభాష్‌చంద్ర వాదనలు
- ఎన్‌సీఎల్‌టీ అధికారంపై అభ్యంతరం



ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర తన వ్యక్తిగత దివాలా కేసులో ఎన్‌సీఎల్‌టీ ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల బెంచ్‌ను సవాల్ చేశారు. ఈ బెంచ్‌ను ఏర్పాటు చేసే అధికారం ఎన్‌సీఎల్‌టీకి లేదని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది సస్మిత్ పత్రా ఎన్‌సీఎల్ఏటీ ముందు వాదించారు. ఎన్‌సీఎల్‌టీ ఆదేశం తప్పుగా ఉందని, చట్టపరమైన అధికార పరిధిని దాటి ఐదుగురు సభ్యులతో బెంచ్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

**విభేదాల పరిష్కారానికే పెద్ద బెంచ్**

సుభాష్ చంద్ర కేసులో ఎన్‌సీఎల్‌టీ డివిజన్ బెంచ్ తొలుత భిన్నాభిప్రాయాలతో తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత నీలేశ్ శర్మను మూడో సభ్యుడిగా నియమించారు. ఆయన ఇచ్చిన ఆదేశాన్ని ఎన్‌సీఎల్‌టీ ఐదుగురు సభ్యుల బెంచ్ సెప్టెంబర్ 1న నిలిపివేసింది. అయితే సుభాష్ చంద్ర తరఫు న్యాయవాది దీనిని వ్యతిరేకించారు. ఇప్పటికే వచ్చిన తీర్పుల్లో రీపేమెంట్ ప్లాన్, అర్హత అంశాలపై స్పష్టత ఉందని, వాటిని మళ్లీ పూర్తిగా విచారించాల్సిన అవసరం లేదని వాదించారు. కంపెనీస్ యాక్ట్‌లోని సెక్షన్ 419(5), 419(6) పరిధి పరిమితమేనని స్పష్టం చేశారు.

**₹6.5 కోట్ల చెల్లింపుపైనే అసలు వివాదం**

సుభాష్ చంద్ర వ్యక్తిగత గ్యారంటీలకు సంబంధించి సుమారు ₹22,006 కోట్ల రుణదాతల క్లెయిమ్‌లకు కేవలం ₹6.5 కోట్లు చెల్లించే ప్రతిపాదన చుట్టూ వివాదం నెలకొంది. అయితే ఈ రీపేమెంట్ ప్లాన్‌కు తుది ఆమోదం ఇంకా లభించలేదని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ వంటి రుణదాతల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ, కేసులో మూడు భిన్న అభిప్రాయాలు వెలువడ్డాయని, అందుకే పెద్ద బెంచ్ అవసరమని పేర్కొన్నారు.

**తదుపరి విచారణ అక్టోబర్ 7న**

ఐదుగురు సభ్యుల బెంచ్ ఏర్పాటును సవాల్ చేయడం ప్రస్తుతం ఎన్‌సీఎల్ఏటీ ముందున్న ప్రధాన అంశం కాదని బెంచ్ స్పష్టం చేసింది. ఈ అంశాన్ని విడిగా సవాల్ చేసుకోవచ్చన్న సూచనను కూడా ప్రస్తుత అప్పీల్‌తో కలిపి అనుమతించలేదు. సుభాష్ చంద్ర తరఫు పిటిషన్‌ను ఉపసంహరించుకునే అభ్యర్థనను తుషార్ మెహతా చివరకు పట్టుబట్టలేదు. దీంతో అప్పీళ్లు కొనసాగనున్నాయి. తదుపరి విచారణను అక్టోబర్ 7, 2026కు ఎన్‌సీఎల్ఏటీ వాయిదా వేసింది.

## రామ మందిర ట్రస్ట్‌లో
# కీలక మార్పులు

- సీఈవోగా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా
- కొత్త పరిపాలనా వ్యవస్థకు శ్రీకారం





అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. ట్రస్ట్ పరిపాలనా వ్యవస్థను మరింత పటిష్టం చేసే చర్యల్లో భాగంగా రిటైర్డ్ ఎయిర్ వైస్ మార్షల్ జితేంద్ర మిశ్రాను తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సీఈవో గా నియమించింది. సెప్టెంబర్ 2న అయోధ్యలో జరిగిన ట్రస్ట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల రామ మందిర విరాళాల దుర్వినియోగం, చోరీ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పరిపాలనలో మరింత క్రమబద్ధత, పారదర్శకత తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ పదవిని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. సీఈవో ఎంపిక కోసం ప్రత్యేక కమిటీ సుమారు 5,585 దరఖాస్తులను పరిశీలించి, దాదాపు రెండు నెలల పాటు అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహించింది.

**31 ఏళ్ల వాయుసేన అనుభవం**

జితేంద్ర మిశ్రా భారత వాయుసేనలో 31 ఏళ్ల పాటు సేవలందించారు. వివిధ విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయనకు విస్తృత నాయకత్వ అనుభవం ఉంది. యుద్ధ సమయంలో విశిష్ట సేవలకు అందించే అత్యున్నత సైనిక పురస్కారాల్లో ఒకటైన సర్వోత్తమ యుద్ధ సేవా పతకం ఆయనకు లభించింది. ఆపరేషన్ సిందూర్‌లోనూ ఆయన భాగస్వామిగా ఉన్నారు. తన ఎంపిక విషయం మీడియా ద్వారా మాత్రమే తెలుసుకున్నానని మిశ్రా తెలిపారు. ఇదే సమావేశంలో ఖాళీగా ఉన్న మూడు ట్రస్టీ స్థానాలను మహేశ్ భగ్‌చంద్కా, మదన్ మోహన్ పాండే, నిర్మలా యాదవ్తో భర్తీ చేశారు. నిర్మలా యాదవ్ ఈ ట్రస్ట్‌లో తొలి మహిళా ట్రస్టీగా నిలిచారు. భగ్‌చంద్కా ట్రెజరర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

**₹1,882 కోట్ల నిధులతో కీలక బాధ్యతలు**

ట్రస్ట్‌లో స్వామి గోవింద్ దేవ్ గిరి జనరల్ సెక్రటరీగా కొనసాగనున్నారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లెక్కలను ట్రస్ట్ ఆమోదించింది. ఆ ఏడాది ట్రస్ట్‌కు సుమారు ₹237 కోట్ల ఆదాయం, దాదాపు ₹99 కోట్ల వ్యయం నమోదైంది. నిర్మాణం, ఇతర సంబంధిత పనుల కోసం సుమారు ₹425 కోట్ల మూలధన వ్యయం జరిగింది. 2026 మార్చి 31 నాటికి ట్రస్ట్ వద్ద మొత్తం నిధులు దాదాపు ₹1,882 కోట్లు ఉన్నట్లు లెక్కలు వెల్లడించాయి. కొత్త సీఈవో నియామకాన్ని విశ్వహిందూ పరిషత్ స్వాగతించింది. వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్ మాట్లాడుతూ జితేంద్ర మిశ్రా అనుభవం ట్రస్ట్ పరిపాలనను మరింత సమర్థంగా, పారదర్శకంగా నడిపేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## కోట్లకు చేరిన
# కూకట్‌పల్లి భూములు

- కేపీహెచ్‌బీలో గజం రూ.2.70 లక్షలు
- ఒక్క వేలంలో బోర్డుకు రూ.47.14 కోట్లు

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ (కేపీహెచ్‌బీ)లో ఓపెన్ ప్లాట్లకు మరోసారి భారీ డిమాండ్ కనిపించింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ప్లాట్లకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో గజం భూమి గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు అమ్ముడైంది. హౌసింగ్ బోర్డు ఈ వేలానికి సంబంధించి ఆగస్టు 10న నోటిఫికేషన్ జారీ చేసింది. చదరపు గజానికి కనీస ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించినా, వేలంలో పాల్గొన్న కొనుగోలుదారుల పోటీతో ధరలు భారీగా పెరిగాయి. మరో ప్లాట్ గజం రూ.2.36 లక్షలకు విక్రయమైంది. మరో రెండు ప్లాట్లకు గజం రూ.2.06 లక్షల ధర పలికింది. వివాదాలు లేని ప్రాంతం, మౌలిక వసతులు, ఇప్పటికే అభివృద్ధి చెందిన కాలనీ కావడంతో కేపీహెచ్‌బీ ప్లాట్లకు మార్కెట్‌లో డిమాండ్ కొనసాగుతోంది.

**19 మంది బిడ్డర్ల పోటీ**

వేలం ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పీ. గౌతం తెలిపారు. తమకు నచ్చిన ప్లాట్లను దక్కించుకునేందుకు మొత్తం 19 మంది బిడ్డర్లు పోటీ పడ్డారు. దీంతో ఒక్కో ప్లాట్‌కు డిమాండ్ పెరిగి ధరలు గణనీయంగా నమోదయ్యాయి. బుధవారం జరిగిన వేలంలో చదరపు గజం సగటు ధర సుమారు రూ.1.79 లక్షలు పలికినట్లు గౌతం వెల్లడించారు. ఈ బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కేపీహెచ్‌బీ వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో భూమికి ఉన్న డిమాండ్ మరోసారి ఈ వేలం ద్వారా స్పష్టమైందని అధికారులు చెబుతున్నారు.



# ఓవైసీ పార్టీకి భారీ షాక్

- కాంగ్రెస్‌లోకి మజ్లిస్ నేత
- యూపీలో ఎన్నికల వేళ ట్విస్ట్
- హస్తంలోకి అసీం వకార్



మజ్లిస్ అధికార ప్రతినిధి సయ్యద్ అసీం వకార్ కాంగ్రెస్‌లో చేరారు. సెప్టెంబర్ 2న న్యూఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రాజేంద్ర పాల్ గౌతమ్, పీసీసీ అధ్యక్షుడు అజయ్ రాయ్, ఏఐసీసీ మైనారిటీ విభాగం చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ సమక్షంలో ఈ చేరిక జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో మజ్లిస్‌కి ప్రముఖ వాయిస్‌గా ఉన్న వకార్ గతంలో అసదుద్దీన్ ఓవైసీకి సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఆయన కాంగ్రెస్‌లో చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఓవైసీ పార్టీపై సంచలన ఆరోపణలు**

కాంగ్రెస్‌లో చేరిన తర్వాత అసీం వకార్ మజ్లిస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీని ఓడించాలనే లక్ష్యం ఉందని చెబుతూనే, క్షేత్రస్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ వంటి పార్టీలను బలహీనపరిచే విధంగా మజ్లిస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీని అధికారంలో నుంచి తొలగించాలంటే ఆ లక్ష్యంతో పోరాడుతున్న శక్తులను బలహీనపరచకూడదని ఆయన అన్నారు. ప్రతిపక్ష పార్టీలపైనే పోరాటం కొనసాగిస్తే చివరకు బీజేపీకే ప్రయోజనం కలుగుతుందని వ్యాఖ్యానించారు. బీజేపీ శత్రువులతో పోరాడితే, అది బీజేపీకి మిత్రులుగా మారినట్టేనని వకార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**2027 ఎన్నికల ముందు కీలక చేరిక**

దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ప్రధాన పోరాటాన్ని కాంగ్రెస్, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముందుకు తీసుకెళ్తున్నారని వకార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత రాజేంద్ర పాల్ గౌతమ్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగాలు, మహిళలు, అణగారిన వర్గాల అంశాలపై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి ఆదరణ పెరుగుతోందని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు అజయ్ రాయ్ ప్రకారం వకార్ చేరికతో 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుంది. ప్రస్తుతం మజ్లిస్ ఉత్తరప్రదేశ్‌లో తన రాజకీయ విస్తరణకు ప్రయత్నిస్తున్న సమయంలో, ఓవైసీకి సన్నిహితంగా ఉన్న కీలక నేతగా గుర్తింపు పొందిన వకార్ పార్టీని వీడటం ఆ పార్టీకి ఎదురుదెబ్బగా మారింది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో బీజేపీకి సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి సవాల్ చేసే అవకాశాల నేపథ్యంలో ఈ చేరికకు మరింత రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది.

# ట్రంప్‌కు పుతిన్ చెక్

- ఇరాన్‌కు రష్యా క్షిపణులు
- మిస్సైళ్ల తయారీకి రహస్య సాయం!
- C430Lతో మారుతున్న ఇరాన్ క్షిపణి శక్తి



రష్యా రహస్యంగా ఇరాన్‌కు అత్యాధునిక క్షిపణి సాంకేతికతను అందిస్తున్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక సంచలన విషయాలను వెల్లడించింది. అమెరికా యుద్ధనౌకలు, విమాన వాహక నౌకలను లక్ష్యంగా చేసుకోగల సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్ల అభివృద్ధికి ఈ సహకారం జరుగుతున్నట్లు సమాచారం. C430L కోడ్ పేరుతో ఈ రహస్య కార్యక్రమం 2023లో రూపుదిద్దుకుంది. ఇందులో కీలకంగా రామ్‌జెట్ ప్రొపల్షన్ సాంకేతికతను ఉపయోగించనున్నట్లు తెలుస్తోంది. ఈ టెక్నాలజీతో క్షిపణులు ధ్వని వేగానికి ఎన్నో రెట్లు వేగంగా దూసుకెళ్లే అవకాశం ఉంటుంది. అత్యంత వేగంతో తక్కువ ఎత్తులో ప్రయాణించే క్షిపణిని గుర్తించడం, ట్రాక్ చేయడం, అడ్డుకోవడం రక్షణ వ్యవస్థలకు మరింత కష్టంగా మారుతుంది.

**రష్యా అగ్రస్థాయి అనుమతి అవసరమైన డీల్**

ఈ స్థాయి సున్నితమైన సైనిక సాంకేతిక బదిలీకి రష్యా ప్రభుత్వ అత్యున్నత స్థాయి రాజకీయ అనుమతి అవసరమై ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇరాన్ రామ్‌జెట్ టెక్నాలజీ కోసం చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. 2023 ఆగస్టులో రామ్‌జెట్ ప్రోటోటైప్‌లను పరీక్షించినట్లు ఇరాన్ మీడియా గతంలో వెల్లడించింది. నవంబర్ 2023లో C430L ఒప్పందం అధికారికంగా కుదిరే ముందే దాని కోసం ఏర్పాట్లు ప్రారంభమైనట్లు లీకైన పత్రాలను పరిశీలించిన ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. ఇరాన్‌కు ఈ సాంకేతికత లభిస్తే అమెరికా నౌకాదళానికి కొత్త వ్యూహాత్మక సవాలు ఎదురవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వేగం, తక్కువ ఎత్తులో ప్రయాణం కలిసివస్తే అమెరికా రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం తగ్గిపోవచ్చు.

**మాస్కో–టెహ్రాన్ బంధంలో కొత్త కోణం**

ఇరాన్‌కు రష్యా సహకారం క్షిపణి రంగానికే పరిమితం కాదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇరాన్ రష్యా డ్రోన్ కార్యక్రమానికి మద్దతు ఇచ్చిన నేపథ్యంలో, మాస్కో కూడా ఇరాన్ క్షిపణి అభివృద్ధికి సాయం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో మాట్లాడిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కష్టకాలంలో అవసరమైన సహాయం అందిస్తామని ప్రకటించారు. ఇదే సమయంలో చైనా నుంచి ఇరాన్‌కు అధిక రిజల్యూషన్ ఉపగ్రహ సాంకేతికత చేరినట్లు కూడా ఆరోపణలు వచ్చాయి. ఆ ఉపగ్రహాన్ని మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక స్థావరాలపై నిఘాకు ఉపయోగించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రష్యా క్షిపణి సాంకేతికత, చైనా ఉపగ్రహ నిఘా సామర్థ్యం ఇరాన్‌కు కలిస్తే అమెరికా బలగాలపై ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## 200 ఏళ్ల తర్వాత ఇంట్లో ఆడపిల్ల!

- ఐదు తరాల నిరీక్షణకు ముగింపు
- గార్గికి ఘనంగా స్వాగతం పలికిన కుటుంబం



మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఓ కుటుంబంలో దాదాపు 200 ఏళ్ల తర్వాత ఆడశిశువు జన్మించింది. ఐదు తరాలుగా ఎదురుచూస్తున్న ఆడపిల్ల పుట్టడంతో దహిఫలే కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. పర్లీలోని కుటుంబ సభ్యులు పాపకు గార్గి అని పేరు పెట్టారు. తల్లి సౌభాగ్యవతి కల్పనా రిషికేశ్ దహిఫలే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత తల్లి, బిడ్డను ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూలతో అందంగా అలంకరించిన రథంలో తల్లి, బిడ్డను కూర్చోబెట్టి ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. డప్పులు, వాయిద్యాల నడుమ జరిగిన ఈ స్వాగత వేడుకను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. చిన్నారిని యువరాణిలా ఇంటికి ఆహ్వానించిన కుటుంబం.. ఈ జన్మను జీవితంలో మరపురాని వేడుకగా మార్చింది. దహిఫలే కుటుంబానికి చెందిన పెద్దలు ఈ సందర్భాన్ని ఎంతో భావోద్వేగంగా తీసుకున్నారు.

**లక్ష్మి వచ్చిందంటూ సంబరం**

గార్గి తాత లింబాజీ దహిఫలే తన కుటుంబంలో ఆడపిల్ల పుట్టడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. ఇన్నేళ్లుగా ఆడపిల్ల లేకపోవడం తమ కుటుంబానికి ఒక లోటుగా ఉండేదని, ఇప్పుడు ఆ లోటు తీరిందని భావోద్వేగంతో తెలిపారు. “ఇంటికి లక్ష్మి వచ్చింది” అంటూ గార్గి నానమ్మ సురేఖ దహిఫలే ఆనందం వ్యక్తం చేశారు. గార్గి తండ్రి కూడా కుమార్తె పుట్టిన ఆనందం ప్రత్యేకమని చెప్పారు. సాధారణంగా కొడుకు కావాలని కోరుకునే వారి కంటే కుమార్తె పుట్టినప్పుడు కలిగే అనుభూతి భిన్నంగా ఉంటుందని, తన కుమార్తెను పువ్వులా పెంచుకుంటామని తెలిపారు. ఈ వేడుక కేవలం కుటుంబ ఆనందానికే పరిమితం కాకుండా సమాజానికి ఒక సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. రెండు శతాబ్దాల తర్వాత పుట్టిన గార్గి రాకతో దహిఫలే కుటుంబంలో కొత్త ఆశలు, ఆనందాలు మొదలయ్యాయి.

## ఓట్ల తొలగింపుపై సిబల్ సంచలన ఆరోపణలు

- బల్క్ డిలీషన్లపై సుప్రీంకోర్టు జోక్యం కోరిన సిబల్



రాజ్యసభ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి కపిల్ సిబల్ ఓటర్ల జాబితాలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న ‘బల్క్ డిలీషన్ల’పై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను అడ్డుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియ బీజేపీకి ఎన్నికల్లో ప్రయోజనం కల్పించేలా సాగుతోందని ఆరోపించారు. బుధవారం ఎక్స్‌లో చేసిన పోస్టులో దీనిని ‘ఎక్స్‌క్లూజన్ పాలిటిక్స్’గా అభివర్ణించారు. బీజేపీ ఏజెంట్లు ముస్లింలను లక్ష్యంగా చేసుకుని పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని సిబల్ ఆరోపించారు. “సుప్రీంకోర్టు దీనిని ఆపాలి” అని స్పష్టం చేశారు.

**ఫారం-7 దుర్వినియోగం జరుగుతోందా?**

జార్ఖండ్‌లో ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించేందుకు ఉపయోగించే ఫారం 7ను బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమర్పిస్తున్నారనే నివేదికను సిబల్ ప్రస్తావించారు. ఒకేసారి 45, 100, 400 వరకు ఫారాలు సమర్పించవచ్చని, తొలగింపుకు కారణం చూపకపోయినా ప్రక్రియ కొనసాగించే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. అయితే నిబంధనల ప్రకారం ఫారం7 ద్వారా మరణం, ప్రాంతం మారడం, ఓటు హక్కుకు అనర్హత వంటి కారణాలతో పేరు తొలగింపును కోరవచ్చు. దరఖాస్తుపై బూత్ లెవల్ అధికారి లేదా ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి విచారణ జరపాలి. ఓటరుకు నోటీసు ఇచ్చిన తర్వాతే తుది చర్య తీసుకోవాల్సి ఉంటుంది. రాజస్థాన్, గుజరాత్, అసోం రాష్ట్రాల్లో కూడా ఇలాంటి బల్క్ ఫారం7 దరఖాస్తులు వెలుగులోకి వచ్చినట్లు సిబల్ పేర్కొన్నారు.

**ముస్లిం ఓటర్లే లక్ష్యమా?**

తొలగింపునకు గురయ్యే జాబితాలో ఉన్న పలువురు ముస్లింలు ఏళ్లుగా అదే ప్రాంతాల్లో నివసిస్తున్నవారేనని సిబల్ ఆరోపించారు. నిష్పాక్షికంగా ఎన్నికల ప్రక్రియ సాగుతున్నదని కోర్టులు భావించి ఈ అంశాన్ని పట్టించుకోకపోతే ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. ఎన్నికలు జరిగే ప్రతి రాష్ట్రంలో ఇదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం ఉందన్నారు. జార్ఖండ్‌లో విపక్ష ప్రభుత్వం ఉండటంతో అక్కడ బీఎల్ఓలు అభ్యంతరం చెబుతున్నారని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలను ఎవరు ప్రశ్నిస్తారని సిబల్ ప్రశ్నించారు. ఈ ఆరోపణలు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మహారాష్ట్ర సర్‌పై చేసిన విమర్శల తర్వాత వచ్చాయి.

## రక్షణ రంగంపై తెలంగాణ
# భారీ ఫోకస్!

- రక్షా ఎక్స్‌పోకు రాజ్‌నాథ్‌కు ఆహ్వానం
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సు



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిశారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు హాజరై.. అందులో భాగంగా నిర్వహించనున్న రక్షా ఎక్స్‌పో2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆహ్వానించారు. తెలంగాణలో రక్షణ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు ఈ సదస్సును వేదికగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

**ఏరోస్పేస్ నుంచి డిఫెన్స్ వరకు**

రక్షా ఎక్స్‌పోలో ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. అత్యాధునిక రక్షణ వ్యవస్థల ప్రదర్శనతో పాటు ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూఆధారిత రక్షణ వ్యవస్థల లైవ్ డెమోలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా రక్షణ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే ఈ కార్యక్రమానికి రాజ్‌నాథ్‌సింగ్ హాజరు కావడం ప్రోత్సాహకరంగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు. రక్షా ఎక్స్‌పోను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు రక్షణశాఖ సహకారం అందించాలని రేవంత్‌రెడ్డి కోరారు. ఎయిర్‌షోకు అవసరమైన ఎయిర్‌స్పేస్ అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భారత వాయుసేనకు చెందిన విమానాలతో పాటు సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ డిస్‌ప్లేకు కూడా మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**విదేశీ రక్షణ సంస్థలతో సమావేశాలు**

ఎగ్జిబిషన్‌లో భారత సైన్యం, నౌకాదళం, వాయుసేనకు చెందిన తాజా రక్షణ వ్యవస్థలను ప్రదర్శించాలని సీఎం కోరారు. మూడు దళాలకు చెందిన ఉన్నతాధికారులు, ప్రతినిధులు ఎక్స్‌పోలో పాల్గొనేలా చూడాలని రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలతో పాటు డీఆర్‌డీవో ప్రయోగశాలలు పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ రక్షణ రంగ ప్రతినిధులను కూడా హైదరాబాద్‌కు తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. విదేశీ రక్షణ మంత్రిత్వశాఖల ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని సీఎం కోరారు. దీనివల్ల తెలంగాణలోని రక్షణ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

**డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు 416.18 ఎకరాలు**

ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన అంశాన్ని కూడా రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తయిందని తెలిపారు. రక్షణశాఖ మొత్తం 1,500 ఎకరాలు కోరిన నేపథ్యంలో మరో 750 ఎకరాలు కూడా సేకరించి అందించేందుకు సీఎం అంగీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాలను కేటాయించేందుకు టీజీఐఐసీ అంగీకరించినట్లు సీఎం తెలిపారు. ఈ భూమిని 33 ఏళ్లకు ఏడాదికి కేవలం రూ.1 లీజు చొప్పున ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ మొత్తం భూమికి రూ.1 చెల్లించేలా నిర్ణయించామని, అవసరమైతే మరో రెండు సార్లు లీజును పొడిగించే అవకాశం ఉంటుందని తెలిపారు.

# ధర్మసందేహం

## జగన్ శిబిరంలో అసలు వ్యూహకర్త ఎవరు?



**ఒక నాయకుడి చుట్టూ తిరిగే నీడలు ఎన్నో ఉంటాయి. కానీ ఆ నీడల్లో ఏది నిజమైన సలహా.. ఏది స్వార్థపు సూచన.. ఏది రాజకీయ వ్యూహం.. ఏది పతనానికి దారితీసే మాయాజాలం అన్నది నాయకుడికి తెలియాల్సిందే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని చూస్తే ప్రజల మధ్య నుంచి ఎదిగిన నాయకుడిగా ఆయనకంటూ ఒక ప్రత్యేకమైన బలం ఉంది. పాదయాత్రలో ప్రజల కష్టాలను విన్నాడు. వాటినే తన రాజకీయ ఆయుధాలుగా మలుచుకున్నాడు. అధికారాన్ని సాధించాడు. కానీ అదే నాయకుడు 2024లో ఊహించని పరాజయాన్ని చవిచూశాడు. ఓటమి తర్వాత పార్టీ అంతర్గత వ్యవహారాలపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఇప్పుడు విజయసాయిరెడ్డి- సజ్జల రామకృష్ణారెడ్డి మధ్య బహిరంగంగా వినిపిస్తున్న విభేదాలు ఆ ప్రశ్నలకు మరింత పదును పెడుతున్నాయి. ఇన్నాళ్లూ తెర వెనుక ఉన్నదని భావించిన వ్యవహారం ఇప్పుడు తెర ముందుకు రావడంతో ఒకే ప్రశ్న రాజకీయ వర్గాలను వెంటాడుతోంది.. జగన్ శిబిరంలో అసలు వ్యూహకర్త ఎవరు?**

విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి.. ఇద్దరూ ఒకప్పుడు జగన్‌కు అత్యంత సమీపంగా కనిపించిన వ్యక్తులే. ఒకరు ఆర్థిక వ్యవహారాలపై పట్టు ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్.. మరొకరు రాజకీయ, మీడియా వ్యవహారాలను లోతుగా అర్థం చేసుకున్న వ్యక్తి. ఇద్దరికీ తమ తమ రంగాల్లో సామర్థ్యం ఉంది. కానీ రాజకీయాల్లో సామర్థ్యం ఒక్కటే సరిపోదు. ప్రజల నాడి తెలియాలి. పార్టీ కార్యకర్తల పల్స్ అర్థం కావాలి. అధినేతకు నచ్చే మాట చెప్పడం కంటే.. నచ్చని నిజాన్ని చెప్పే ధైర్యం ఉండాలి. అక్కడే అసలు వ్యూహకర్తకు పరీక్ష మొదలవుతుంది.

**జగన్ ఓటమి వెనుక పరివార ప్రభావం**

అధికారంలో ఉన్నప్పుడు చుట్టూ కనిపించే ప్రతి ముఖం విజయానికి కారణంగా అనిపించవచ్చు. కానీ ఓటమి వచ్చినప్పుడు అదే ముఖాల్లో ఎవరు అద్దమో.. ఎవరు తెరమో తెలుస్తుంది. ఇప్పుడు వైసీపీలో జరుగుతున్న చర్చ కూడా ఇదే. అయితే జగన్ ఓటమికి ఇద్దరి మధ్య ఆధిపత్య పోరే కారణమని తేల్చేయడం రాజకీయంగా సరళీకరణ అవుతుంది. ఎన్నికల ఫలితాలు ఒక్కరి వ్యూహంతోనో, ఒక్కరి తప్పిదంతోనో రావు. ప్రజల అభిప్రాయం, ప్రభుత్వ పనితీరు, అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయాలు, కూటమి సమీకరణాలు, ప్రతిపక్ష ప్రచారం.. ఇలా అనేక అంశాలు కలిసొచ్చి ఒక తీర్పును ఇస్తాయి. అయినప్పటికీ అధినేత చుట్టూ ఉండే సలహాదారుల వ్యవస్థ ఆ తీర్పును ప్రభావితం చేయగలదు. క్షేత్రస్థాయి అసంతృప్తి పైకి చేరకపోతే.. చేరినా పట్టించుకోకపోతే.. ప్రజల మాట కంటే పరివారపు మాట బలపడితే.. ఒకరోజు ప్రజల తీర్పు గోడను ఢీకొంటుంది. 2024 ఎన్నికల ఫలితాలను ఈ కోణంలో కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. జగన్ రాజకీయ ఎదుగుదలలో ఆయన స్వయంగా పోషించిన పాత్రను ఎవరూ తక్కువ చేయలేరు. కాంగ్రెస్‌తో విభేదాల నుంచి మొదలైన ప్రయాణం.. ఓదార్పు యాత్ర.. పాదయాత్ర.. వైసీపీ నిర్మాణం.. 2019 విజయం.. ఇవన్నీ ఆయన వ్యక్తిగత రాజకీయ పట్టుదలకు నిదర్శనాలు. అయితే నాయకుడి వ్యక్తిగత బలం ఎంత గొప్పదైనా.. ఆయన చుట్టూ ఉన్న వ్యవస్థ బలహీనమైతే ఆ బలం క్రమంగా ఒంటరిగా మారుతుంది. అధినేతకు ప్రతిరోజూ చేరే సమాచారం రాజకీయ వాస్తవాలకు ప్రతిబింబమా? లేక ఆయన చుట్టూ ఉన్నవారి అంచనాల ప్రతిధ్వని మాత్రమా? అన్నదే కీలకం.

**సాయిరెడ్డి- సజ్జల వివాదంతో వైసీపీకి సంకటం**

నాయకుడికి శత్రువుల కంటే ప్రమాదకరమైనది తప్పు సమాచారాన్ని నిజమైన సమాచారంగా నమ్మించే వ్యవస్థ. ప్రజలు చెప్పిన మాట వినిపించకపోతే.. ప్రజలు చెప్పే తీర్పు చివరికి వినిపించాల్సిందే. ఇప్పుడు సాయిరెడ్డి--సజ్జల వివాదం వైసీపీకి మరో సంకేతాన్ని ఇస్తోంది. వ్యక్తుల మధ్య మాటల యుద్ధం ఎంత జరిగినా అది వ్యక్తిగత స్థాయిలోనే ఆగిపోతే పెద్ద నష్టం ఉండకపోవచ్చు. కానీ అది పార్టీ అంతర్గత నిర్ణయ ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తే స్థాయికి వెళితే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఎవరు జగన్‌కు అత్యంత దగ్గర? ఎవరి మాటకు ఎక్కువ విలువ? ఎవరి వ్యూహం పార్టీని నడిపించింది? ఎవరి నిర్ణయాలు అమలయ్యాయి? అనే ప్రశ్నలు బయటకు వస్తాయి. నెంబర్-2 కోసం పోటీ జరిగిందా? లేక నెంబర్-2 అనే ముద్రను రాజకీయ ప్రత్యర్థులు సృష్టించారా? అన్నది కూడా తేలాల్సిందే. ఎందుకంటే పార్టీలో పదవులు మారవచ్చు.. వ్యక్తులు మారవచ్చు.. కానీ నాయకత్వ నిర్ణయ వ్యవస్థపై ఏర్పడిన అనుమానం అంత తేలిగ్గా పోదు. చివరికి అసలు ధర్మసందేహం సాయిరెడ్డి గొప్పవారా.. సజ్జల గొప్పవారా.. అన్నది కాదు. జగన్‌కు నిజమైన రాజకీయ వ్యూహం ఎవరు ఇచ్చారు? ఆ వ్యూహం ప్రజల దగ్గర పనిచేసిందా? అన్నదే. ఒకప్పుడు జగన్ పేరు వినిపిస్తే వైసీపీ గుర్తొచ్చేది. ఇప్పుడు వైసీపీ అంతర్గత వ్యవహారాలు వినిపిస్తే సాయిరెడ్డి.. సజ్జల పేర్లు వినిపించడం ఆ పార్టీకి ఎంతవరకు మేలు చేస్తుందో ఆలోచించాల్సిందే. నాయకుడి చుట్టూ చేరినవాళ్లు చరిత్రను రాయరు.. కానీ వారు ఇచ్చే సలహాలు నాయకుడి రాజకీయ చరిత్రను మార్చగలవు. అందుకే 2024 ఓటమి తర్వాత వైసీపీ ముందున్న పని ప్రత్యర్థులను నిందించడం కాదు.. తనలోని లోపాలను వెతకడం. ఎవరు ముంచారు అన్న ప్రశ్నకు సమాధానం వెతకడం కంటే.. ఇకపై ఎవరి మాట వింటే పార్టీ మునగదో నిర్ణయించుకోవడం ముఖ్యం. ఎందుకంటే ఓటమి ఒకసారి వస్తే అది తీర్పు.. రెండోసారి వస్తే అది హెచ్చరిక.. మూడోసారి వస్తే అది చరిత్ర.

– హుస్సేన్

## స్కాలర్‌షిప్‌ల పేరుతో సైబర్ మోసాలు



బాపట్ల, సెప్టెంబర్ 2: స్కాలర్‌షిప్‌ల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో స్కాలర్‌షిప్ దరఖాస్తులను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యాశాఖ లేదా స్కాలర్‌షిప్ విభాగం అధికారులమంటూ ఫోన్ చేసి స్కాలర్‌షిప్ మంజూరైందని, ఖాతాలో నగదు జమ చేయడానికి ఆధార్, బ్యాంకు ఖాతా, డెబిట్ కార్డు, పిన్, ఓటీపీ వివరాలు అడుగుతున్నారని చెప్పారు. వాట్సాప్, మెసేజ్‌ల ద్వారా అనుమానాస్పద లింకులు పంపి నకిలీ వెబ్‌సైట్లతో వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడం, ప్రాసెసింగ్ ఫీజు పేరుతో నగదు వసూలు చేయడం వంటి మోసాలు జరుగుతున్నాయని వివరించారు. స్కాలర్‌షిప్‌కు సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్ లేదా విద్యాసంస్థ ద్వారా మాత్రమే నిర్ధారించుకోవాలని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయకూడదని, అనుమానాస్పద యాప్‌లు ఇన్‌స్టాల్ చేయకూడదన్నారు. పొరపాటున మోసపోతే వెంటనే 1930కు కాల్ చేయడంతో పాటు సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసుల కఠిన చర్యలు



ప్రొద్దుటూరు: మైనర్లు వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఆర్ట్స్ కాలేజ్ నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎస్సై మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం 20 కేసులు నమోదు చేసి రూ.15,650 జరిమానా విధించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడటంతో వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. రహదారి భద్రతకు విఘాతం కలిగించే ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని వన్‌టౌన్ పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని వాహనదారులకు సూచించారు.

## పెన్నా నదిలో గుర్తు తెలియని మృతదేహం



ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామేశ్వరం బైపాస్ సమీపంలో పెన్నా నది నీటి కుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. గంగమ్మ ఆలయం వెనుక నీటి కుంటలో బుధవారం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం ఉన్న పరిస్థితులను బట్టి రెండు, మూడు రోజుల క్రితమే అతడు మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుడు పాయింట్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి గుర్తింపు, మృతికి గల కారణాలు తెలియరాకపోవడంతో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి వివరాలు సేకరిస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తించినా, అతడి ఆచూకీకి సంబంధించిన సమాచారం తెలిసినా ప్రొద్దుటూరు రూరల్ పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు.

## పవన్ జన్మదిన వేడుకల్లో జనసేన శపథం



ప్రొద్దుటూరు: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ప్రొద్దుటూరు నందిని క్లాత్ మార్కెట్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో నాయకుడు మాదాసు మురళి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేక్ కట్ చేసి జనసైనికులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాదాసు మురళి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదినం ప్రతి జనసైనికుడికి ప్రత్యేకమైన రోజని అన్నారు. సినీ రంగంలో తన ప్రతిభతో కోట్లాది అభిమానులను సంపాదించుకున్న పవన్ కళ్యాణ్ ప్రజా జీవితంలోకి ప్రవేశించి తన ఆలోచనలు, సిద్ధాంతాలతో రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్‌కు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మేలు చేసేలా ఆయన చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రొద్దుటూరులో జనసేనకు కేటాయించిన స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి జనసైనికుడు సమష్టిగా పనిచేస్తారని మాదాసు మురళి తెలిపారు. కార్యక్రమంలో అల్లం చంద్రశేఖర్, దేవానంద్, కోటి నాగార్జున, జోడు అఖిల్, వంశీ రెడ్డి, మహమ్మద్, హరీష్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చీరాలలో పోలీసుల భద్రతా కవాతు

**ఎన్నికల వేళ నాకాబందీతో పోలీసుల నిఘా**

చీరాల, సెప్టెంబర్ 2: రాబోయే ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, పారదర్శక ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా చీరాల పోలీసులు భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించి ఫుట్ మార్చ్ చేపట్టారు. ఉడ్‌నగర్ చర్చ్ కాంపౌండ్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు కాలినడకన పర్యటించి ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు. ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సీఐ తెలిపారు. మరోవైపు పట్టణంలోని రద్దీ ప్రాంతమైన మసీదు సెంటర్‌లో ఎస్సైలు రాజ్యలక్ష్మి, హరిబాబు ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని నిలిపి పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో వివరాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో అల్లర్లు, శాంతిభద్రతలకు విఘాతం, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను సహించబోమని సీఐ స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అనుమానితుల కదలికలపై నిఘా కొనసాగుతుందని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.





## పల్నాడులో లోకేష్ పర్యటన

**రూ.70 కోట్లతో జేఎన్‌టీయూకేలో వసతి సౌకర్యాలు**

నర్సరావుపేట: పల్నాడు జిల్లాలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం పర్యటించారు. కాకాని గ్రామంలోని జేఎన్‌టీయూకే యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించిన మూడు నూతన హాస్టల్ భవనాలను మంత్రి ప్రారంభించారు. గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన ఈ వసతి గృహాల్లో 1,600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించారు. కాలేజీకి చేరుకున్న లోకేష్‌కు యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి హాస్టళ్లను ప్రారంభించారు. హాస్టల్ భవనాల్లో కలియతిరిగి విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్‌టీయూకే వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భూమి హక్కులకు కొత్త భరోసా

**876 మంది రైతులకు పాస్‌పుస్తకాలు**

ప్రొద్దుటూరు: రైతుల భూమి హక్కులకు భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. బుధవారం చౌడూరు గ్రామంలోని స్వర్ణ గ్రామం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 876 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. చౌడూరు గ్రామంలో మొత్తం 923 మంది పట్టాదారులు ఉండగా, రీ-సర్వే ప్రక్రియ పూర్తైన 876 మంది రైతులకు తొలి విడతగా పాస్‌పుస్తకాలు అందించినట్లు తెలిపారు. రైతుల భూమి హక్కులకు సంబంధించిన పత్రాలను వారి చేతికే అందించడం ద్వారా హక్కులకు మరింత భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పాస్‌పుస్తకాలపై రాజకీయ నాయకుల ఫొటోలకు బదులుగా ప్రభుత్వ రాజముద్రతో పత్రాలను అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ విధానాలకు భిన్నంగా రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చౌడూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, ఆర్ఐ నాగమోహన్ రెడ్డి, పట్నం లక్ష్మణ్, టీడీపీ నేతలు రవికుమార్ రెడ్డి, శంకరాపురం మారుతి ప్రసాద్ రెడ్డి, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## సాన సతీష్‌తో భూమిరెడ్డి కీలక భేటీ



విజయవాడ: రాజ్యసభ సభ్యుడు సాన సతీష్‌ను పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఆత్మీయంగా సమావేశమై రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలు, రాయలసీమకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ప్రజా ప్రయోజనాలకు చేపట్టాల్సిన చర్యలు, ప్రాంతీయ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరంపై తమ అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాల్సిన అంశాలను చర్చించారు. రాయలసీమ ప్రాంతానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించడంపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలతో పాటు ముఖ్యంగా రాయలసీమ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సానుకూల వాతావరణంలో చర్చ సాగినట్లు వెల్లడించారు.

**నందికొట్కూరు డంపింగ్ యార్డ్**

## చెత్త ప్లాంట్ ట్రయల్ రన్ పూర్తి



నందికొట్కూరు: నంద్యాల జిల్లా నందికొట్కూరులోని డంపింగ్ యార్డ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అధికారులను, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన ఆయన కాంపౌండ్ వాల్, షెడ్ల నిర్మాణం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ నెలాఖరు నాటికి చెత్త ప్రాసెసింగ్ కేంద్రం ట్రయల్ రన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్లాంట్ నిర్వహణకు అవసరమైన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, పవర్ సప్లై పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కాంపౌండ్ వాల్, గేటు, ఫెన్సింగ్ పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. ప్లాంట్ నిర్వహణపై ఏజెన్సీ ప్రతినిధులు ప్రత్యేకంగా ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహిస్తారని తెలిపారు. స్థానికులకు దుమ్ము, దుర్వాసనతో ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే ఏజెన్సీని మార్చుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## వైఎస్సార్ వర్ధంతిలో శ్రీకాంత్

విజయవాడ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా విజయవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పార్టీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు. తొలుత విజయవాడలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్ అనంతరం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. వైఎస్సార్ ప్రజలకు అందించిన సంక్షేమ పాలన, పేదలు, బలహీన వర్గాల కోసం అమలు చేసిన పథకాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతివృత్తుల విభాగం అధ్యక్షుడు జవ్వాది సుధీర్, బీసీ నాయకులు జామి కేశవ్, చింతలూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నిన్న యువతను ఓటు బ్యాంక్‌గా చూశారు. నేడు యువతనే రాజకీయ పవర్‌గా చూస్తున్నారు. ఇంతకాలం ఎన్నికల ముందు యువతను పలకరించిన రాజకీయ నాయకులు.. ఇప్పుడు ఎన్నికలకు మూడేళ్ల ముందే యువత చుట్టూ తమ రాజకీయ వ్యూహాలను అల్లుతున్నారు. సభల్లో యువత.. సోషల్ మీడియాలో యువత.. ఉద్యమాల్లో యువత.. పార్టీల కొత్త కమిటీల్లో యువత.. చివరికి రాజకీయ నినాదాల్లోనూ యువతే. కారణం ఒక్కటే.. జెన్‌జీ ఇక ప్రేక్షకులు కాదు. ప్రశ్నించే శక్తి. స్పందించే శక్తి. సమీకరించే శక్తి. అవసరమైతే రాజకీయ దిశను మార్చే శక్తి. జంతర్ మంతర్ పరిణామాలు ఇచ్చిన సంకేతం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ ప్రతిధ్వనిస్తున్నట్టుగా కనిపిస్తోంది. యువత ఒక అంశంపై ఏకమైతే.. అది సోషల్ మీడియా హ్యాష్‌ట్యాగ్ దగ్గర ఆగిపోదని, రాజకీయ పార్టీలను కూడా స్పందించేలా చేయగలదని తేలిపోయింది. దీంతో ఇంతకాలం యువతను తమ రాజకీయ సమీకరణాల్లో ఒక భాగంగా చూసిన పార్టీలు.. ఇప్పుడు యువతనే తమ భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు కేంద్రబిందువుగా మార్చుకుంటున్నాయి. అందుకే ఒక్కసారిగా పార్టీల స్వరం మారింది. యువతకు ఉద్యోగాలు కావాలంటున్నారు. యువతకు అవకాశాలు కావాలంటున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలంటున్నారు. యువత నాయకత్వం వహించాలంటున్నారు. మాటల్లో చూస్తే ఇదంతా ప్రేమే. కానీ రాజకీయాల లోతుల్లోకి వెళ్లి చూస్తే.. ఇది ప్రేమ కంటే అవసరం ఎక్కువ. ఎందుకంటే రాబోయే ఎన్నికల రాజకీయాన్ని నిర్ణయించే అతిపెద్ద శక్తుల్లో జెన్‌జీ ఒకటిగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం నుంచి ప్రతిపక్ష వైసీపీ వరకు.. ప్రతి పార్టీకి యువత ఇప్పుడు ప్రత్యేక రాజకీయ లక్ష్యంగా మారింది.



# జెన్‌జీ దెబ్బకు మారుతున్న వ్యూహాలు

## యువత చుట్టూ 2029 రాజకీయం

- 12 ఏళ్ల తర్వాత జనసేనకు 'జైకొట్టు'
- జెన్‌జీ ఆలోచన వేరు.. పార్టీల లెక్క వేరు
- నిన్నటి ఓటు బ్యాంక్.. నేటి పొలిటికల్ పవర్!

**పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన 12 ఏళ్ల తర్వాత ప్రత్యేకంగా యువజన విభాగాన్ని ప్రారంభించడం.. జగన్ వైపు నుంచి డీఎస్సీని కేంద్రంగా చేసుకుని యువత ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం.. చంద్రబాబు యువతతో తన అనుబంధాన్ని పదేపదే ప్రస్తావించడం.. లోకేశ్ 'యువగళం'తో మొదలుపెట్టి యువతతో నేరుగా మమేకం కావడం.. ఇవన్నీ కలిపి చూస్తే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ పార్టీలకు ఇప్పుడు యువత కావాలి. కానీ యువతకు మాత్రం రాజకీయ పార్టీల నుంచి ఏం కావాలో ఇంకా స్పష్టంగా తెలుసు. ఇదే అసలు ట్విస్ట్!**

### • జంతర్ మంతర్ షాక్.. రాజకీయ పార్టీల కలవరం

జెన్‌జీ రాజకీయ చైతన్యం ఒక్కరోజులో పుట్టింది కాదు. కొత్త తరానికి రాజకీయాలపై ఉన్న అవగాహన, సమాచారాన్ని స్వీకరించే వేగం, సామాజిక మాధ్యమాల ప్రభావం, ఉద్యోగం-విద్య-భవిష్యత్తుపై ఉన్న ఆందోళన.. ఇవన్నీ కలిసే ఈ కొత్త రాజకీయ శక్తిని తయారు చేశాయి. జంతర్ మంతర్ పరిణామాలు ఆ శక్తికి ఒక ముఖాన్ని, ఒక దిశను ఇచ్చినట్టుగా కనిపించాయి. అభిజిత్ దీప్కే సాగించిన చొరవ, తెగువతో యువతను ఒక అంశం చుట్టూ సమీకరించిన తీరు రాజకీయ వర్గాలకు ఒక బలమైన సందేశాన్ని ఇచ్చింది. నాయకత్వం అంటే కేవలం పదవి, పార్టీ, జెండా అవసరం లేదని.. ఒక సమస్యపై నమ్మకం ఉంటే యువతను కదిలించగలమని ఈ పరిణామం చూపించింది. ఎందుకంటే ఇప్పటివరకు రాజకీయ సమీకరణాలకు పార్టీ నిర్మాణం, కులం, ప్రాంతం, నాయకుడి వ్యక్తిగత ప్రభావం, ఆర్థిక బలం వంటి అంశాలు ప్రధాన ఆధారాలుగా ఉండేవి. ఇప్పుడు వాటితో పాటు మరో శక్తి ముందుకొచ్చింది. అది యువత సామూహిక స్పందన. ఒక వీడియో వైరల్ కావడానికి గంటలు అవసరం లేని కాలం ఇది. ఒక సమస్య దేశవ్యాప్తంగా చర్చకు రావడానికి పెద్ద రాజకీయ నాయకుడి మద్దతు అవసరం లేని కాలం ఇది. ఒక ప్రశ్నను లక్షల గొంతులు ఒకేసారి వినిపించగల కాలం ఇది. అందుకే జెన్‌జీని రాజకీయ పార్టీలు ఇక నిర్లక్ష్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది.

### • జనసేనలో 'జైకొట్టు'

ఈ మారుతున్న రాజకీయ వాతావరణంలో జనసేన తీసుకున్న నిర్ణయం ఆసక్తికరంగా మారింది. పార్టీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తయిన తర్వాత యువజన విభాగాన్ని ప్రారంభించడం సాధారణ సంస్థాగత ప్రక్రియ కాదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పిఠాపురం వేదికగా యువజన విభాగాన్ని ప్రారంభించడం.. మంత్రి నాదెండ్ల మనోహర్ 'జైకొట్టు' లోగోను ఆవిష్కరించడం.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆడియో ద్వారా సందేశం ఇవ్వడం.. ఇవన్నీ యువతను పార్టీ నిర్మాణంలో మరింత వ్యవస్థీకృతంగా భాగస్వామ్యం చేయాలనే ఆలోచనను సూచిస్తున్నాయి. జనసేనకు మొదటి నుంచీ యువతలో ప్రత్యేకమైన ఆదరణ ఉంది. పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణంలో యువత మద్దతు ఒక ప్రధాన బలం. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బలాన్ని సంస్థాగత శక్తిగా మార్చుకోవాల్సిన అవసరం కూడా ఏర్పడింది. ఇప్పుడు 'జైకొట్టు' ఆ బాధ్యతను ఎంతవరకు మోస్తుందన్నది చూడాలి. యువతను సభలకు తీసుకురావడం ఒకటి. వారిని పార్టీ ఆలోచనా విధానంలో భాగం చేయడం మరొటి. సోషల్ మీడియాలో జనసేన తరఫున పోస్టులు పెట్టించడం ఒకటి. పార్టీ విధానాల రూపకల్పనలో యువత అభిప్రాయానికి స్థానం కల్పించడం మరొటి. 'జైకొట్టు' నిజంగా యువత గొంతుకగా మారితే.. అది జనసేనకు దీర్ఘకాలిక రాజకీయ ఆస్తిగా మారుతుంది. లేకపోతే మరో పార్టీ యువజన విభాగంలా మిగిలిపోయే ప్రమాదం ఉంటుంది.

### • జగన్.. యువత ఉద్యమమే ఆయుధమా?

ప్రతిపక్ష వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా యువత సమస్యలను తన రాజకీయ పోరాటానికి కేంద్రంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ముఖ్యంగా డీఎస్సీ అంశాన్ని తీసుకుని 'మెగా డీఎస్సీ.. దగా డీఎస్సీ' అంటూ యువతను సమీకరించే ప్రయత్నం అందులో భాగమే. ఉద్యోగార్థుల ఆవేదన రాజకీయంగా అత్యంత సున్నితమైన అంశం. ఎందుకంటే ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి సిద్ధమయ్యే యువతకు ఒక్క నియామక ప్రకటన కూడా వారి భవిష్యత్తుతో ముడిపడి ఉంటుంది. పోస్టుల సంఖ్య, నోటిఫికేషన్, పరీక్ష విధానం, నియామక ప్రక్రియ.. ప్రతి అంశం వారి జీవితంపై ప్రభావం చూపుతుంది. అందుకే వైసీపీ ఈ అంశాన్ని ఉద్యమంగా మలచాలనుకోవడం రాజకీయంగా అర్థం చేసుకోదగిన వ్యూహమే. కానీ ఇక్కడ కూడా యువతకు ఒక ప్రశ్న ఉంటుంది. ఉద్యోగం కోసం పోరాడుతున్న యువతకు ఎవరు రాజకీయంగా అండగా నిలుస్తున్నారు? అన్నదానికంటే.. ఎవరు నిజంగా ఉద్యోగ అవకాశాలు కల్పించగలరు? అన్నదే వారికి ముఖ్యం. ప్రతిపక్షం విమర్శించడం సహజం. అధికార పక్షం సమర్థించుకోవడం సహజం. కానీ చివరికి యువత కోరేది మాత్రం ఫలితం.

### • చంద్రబాబు.. వయసు కాదు ఆలోచనలే ముఖ్యం!

డీఎస్సీ అంశంలో వైసీపీ యువతను ప్రభుత్వంపై పోరాటానికి సమీకరించే ప్రయత్నం చేస్తే.. టీడీపీ కూడా అదే యువతరంగాన్ని వైసీపీపై ఎదురుదాడికి వినియోగించే పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక కొత్త రాజకీయ పోటీకి నాంది. ఇక నుంచి ఏ సమస్యపై యువత స్పందించినా.. అధికార పార్టీ దానిని ఎలా సమర్థించుకుంటుంది? ప్రతిపక్షం ఎలా రాజకీయంగా మలుచుకుంటుంది? సోషల్ మీడియాలో ఎవరు కథనాన్ని తమకు అనుకూలంగా తిప్పుకుంటారు? అన్నది కూడా ఎన్నికల వ్యూహంలో భాగమవుతుంది. డీఎస్సీ ఇందుకు ఒక ఉదాహరణ మాత్రమే. ఉద్యోగాలు, ఫీజులు, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, పరిశ్రమలు, ఐటీ, క్రీడలు, విద్య, విదేశీ విద్య.. ఇలా యువతకు సంబంధించిన ప్రతి అంశం రాబోయే కాలంలో రాజకీయ చర్చకు వస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తరచూ తన వయసు రీత్యా కాకుండా ఆలోచనల రీత్యా తాను ఎప్పటికీ యువకుడినేనని చెప్పుకుంటూ ఉంటారు. ఇది ఆయన రాజకీయ శైలికి సరిపోయే వ్యాఖ్యే. టెక్నాలజీ, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలను రాష్ట్ర భవిష్యత్తుతో అనుసంధానం చేయడం ద్వారా యువతకు అభివృద్ధి రాజకీయాలను చూపించే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు లెక్కలో యువతకు ఉద్యోగం రావాలంటే ముందుగా పరిశ్రమ రావాలి. పరిశ్రమ రావాలంటే పెట్టుబడి రావాలి. పెట్టుబడి రావాలంటే మౌలిక వసతులు ఉండాలి. అందుకే అభివృద్ధి-పెట్టుబడులు-ఉపాధి అనే గొలుసును యువత భవిష్యత్తుతో అనుసంధానం చేస్తున్నారు. కానీ దీనికి ఫలితమే తుది ప్రమాణం. యువతకు పెట్టుబడుల ప్రకటనల కంటే ఉద్యోగం ముఖ్యం. ప్రాజెక్టుల సంఖ్య కంటే తమ చేతిలోకి వచ్చే అవకాశాలు ముఖ్యం. హామీల కంటే అమలు ముఖ్యం.

### • లోకేశ్.. యువగళం నుంచి రాజకీయాలు

కూటమి ప్రభుత్వంలో యువతతో అత్యంత చురుకైన అనుసంధానం కొనసాగిస్తున్న నాయకుల్లో నారా లోకేశ్ ఒకరు. ఆయన చేపట్టిన పాదయాత్రకు 'యువగళం' అనే పేరు పెట్టడం నుంచే యువతను రాజకీయ చర్చకు కేంద్రంగా తీసుకురావాలన్న ప్రయత్నం కనిపించింది. ఇప్పుడు కూడా పర్యటనల్లో యువతతో ముఖాముఖి మాట్లాడటం.. విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువ పారిశ్రామికవేత్తలతో చర్చించడం.. వివిధ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. లోకేశ్ రాజకీయ ప్రయాణంలో యువత ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నట్టుగా కనిపిస్తోంది. తండ్రి చంద్రబాబు అనుభవం.. తన తరం రాజకీయ ఆలోచనలు.. రెండింటినీ కలిపి ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది. తండ్రీకొడుకులు ఇద్దరూ వేదికలపై యువతతో నేరుగా మాట్లాడే దృశ్యాలు కూడా రాజకీయంగా ఒక ప్రత్యేక సందేశాన్ని ఇస్తున్నాయి. అనుభవం పాలనను నడిపించవచ్చు. కానీ భవిష్యత్తును నడిపించేది కొత్త తరం. అందుకే లోకేశ్కు యువతతో ఉన్న అనుసంధానం రాబోయే రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉంది.

### • కూటమిలోనూ.. వైసీపీలోనూ ఒకే టార్గెట్!

జనసేన 'జైకొట్టు'.. టీడీపీ 'యువగళం'.. వైసీపీ యువజన ఉద్యమాలు.. బీజేపీ తనదైన యువజన రాజకీయాలు.. పేర్లు వేరు కావచ్చు. జెండాలు వేరు కావచ్చు. సిద్ధాంతాలు వేరు కావచ్చు. కానీ టార్గెట్ మాత్రం ఒక్కటే యువత. ఇది కేవలం ఎన్నికల లెక్క కాదు. ఇది జనాభా నిర్మాణంలో జరుగుతున్న మార్పుకు రాజకీయ ప్రతిబింబం కూడా. యువత సంఖ్య ఎక్కువగా ఉన్న సమాజంలో వారి సమస్యలను పక్కన పెట్టి రాజకీయాలు చేయడం కష్టం. ఒక తరం ఉద్యోగం లేకుండా ఉంటే.. ఆ అసంతృప్తి కుటుంబాల వరకు వెళ్తుంది. ఒక తరం విద్యా అవకాశాల కోసం పోరాడితే.. దాని ప్రభావం సమాజంపై పడుతుంది. అందుకే యువత సమస్య అంటే కేవలం యువత సమస్య కాదు. అది ప్రతి కుటుంబ సమస్య. యూత్ పై ప్రేమ నిజమా.. రాజకీయ అవసరమా? ఇక్కడే అసలు ప్రశ్న. పార్టీలకు యువతపై ఇప్పుడు పుట్టుకొచ్చిన ఈ ప్రేమ నిజమైనదా? లేక 2029 ఎన్నికల కోసం వేసిన రాజకీయ లెక్కా? జవాబు చెప్పాల్సింది రాజకీయ పార్టీలు కాదు. యువతే. ఎందుకంటే యువతను సభల్లో పొగడటం సులభం. వారి సమస్యలపై ప్రసంగించడం సులభం. సోషల్ మీడియాలో యువత పేరుతో ప్రచారం చేయడం ఇంకా సులభం. కానీ ఉద్యోగం కల్పించడం కష్టం. విద్యా ప్రమాణాలు పెంచడం కష్టం. నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం కష్టం. యువ పారిశ్రామికవేత్తలకు అండగా నిలవడం కష్టం. వేలాది మంది యువతకు నైపుణ్యాలు అందించడం కష్టం. అందుకే అసలు రాజకీయ పరీక్ష అక్కడే మొదలవుతుంది. జెన్‌జీని మభ్యపెట్టడం అంత సులభం కాదు! ఇప్పటి యువతను పాత రాజకీయ పద్ధతులతో అంచనా వేయడం పెద్ద పొరపాటు. ఈ తరం ఒక నాయకుడి మాట విని నిర్ణయం తీసుకునే తరం కాదు. పోల్చుతుంది. పరిశీలిస్తుంది. ప్రశ్నిస్తుంది. సోషల్ మీడియాలో సమాచారం సేకరిస్తుంది. గతాన్ని గుర్తుంచుకుంటుంది. ప్రస్తుతాన్ని గమనిస్తుంది. భవిష్యత్తును అంచనా వేస్తుంది. ఒక నాయకుడు ఏం చెప్పాడన్నదే కాదు.. ఏం చేశాడన్నది కూడా చూస్తుంది. అందుకే రాజకీయ పార్టీలకు ఇప్పుడు ఒక కొత్త సవాలు ఎదురవుతోంది. యువతను ఆకట్టుకోవడం కాదు.. యువత నమ్మకాన్ని సంపాదించడం. ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉంది.

### • 2029కు ముందే మొదలైన యుద్ధం.. చివరికి 'జైకొట్టు' ఎవరికో?

2029 ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. కానీ రాజకీయ వ్యూహాలు మాత్రం ఇప్పుడే మొదలయ్యాయి. నియోజకవర్గాల సమీకరణాలు.. పార్టీ నిర్మాణాలు.. సోషల్ మీడియా వ్యూహాలు.. యువత కార్యక్రమాలు.. ఉద్యమాలు.. ఇవన్నీ భవిష్యత్ ఎన్నికల బ్లూప్రింట్ లో భాగంగానే కనిపిస్తున్నాయి. అందులో యువతకు ఇచ్చే ప్రాధాన్యం అత్యంత కీలకం. ఎందుకంటే 2029 నాటికి ఈరోజు రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న యువతలో చాలా మంది ఓటర్లుగా మాత్రమే కాకుండా.. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా.. ఉద్యోగ రంగంలో నిర్ణయాత్మక వ్యక్తులుగా.. స్థానిక నాయకులుగా.. సామాజిక కార్యకర్తలుగా.. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే శక్తులుగా ఎదిగే అవకాశం ఉంది. అందుకే ఇప్పటి నుంచే వారిని చేరుకోవాలని అన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటివరకు రాజకీయ పార్టీలు యువతకు నినాదాలు ఇచ్చాయి. ఇక యువత రాజకీయ పార్టీలకు నినాదాలు ఇవ్వబోతోంది. ఇప్పటివరకు నాయకులు యువతను పిలిచారు. ఇక యువత నాయకులను పిలవబోతోంది. ఇప్పటివరకు పార్టీలు యువతకు ఏం ఇస్తామో చెప్పాయి. ఇక యువత పార్టీలు ఏం ఇచ్చాయో లెక్క అడగబోతోంది. ఇదే జెన్‌జీ రాజకీయాల అసలు స్వరూపం. జనసేన 'జైకొట్టు' అన్నా.. టీడీపీ 'యువగళం' అన్నా.. వైసీపీ 'యువ ఉద్యమం' అన్నా.. నినాదం మారవచ్చు. కానీ యువత అడిగే ప్రశ్న మాత్రం మారదు. "మా భవిష్యత్తు కోసం మీ దగ్గర ఏం ఉంది?" ఈ ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పగలిగిన పార్టీనే యువత మనసులో నిలబడుతుంది. సభల్లో యువతకు ముందు వరుసలో కుర్చీలు వేయడం కాదు.. పాలనలో వారికి ముందు వరుసలో స్థానం ఇవ్వాలి. వేదికపై మాట్లాడించేంత మాత్రాన యువతకు గౌరవం దక్కదు.. నిర్ణయాల్లో వారి గొంతుకు విలువ వచ్చినప్పుడే నిజమైన భాగస్వామ్యం ఏర్పడుతుంది.



### • యువత ఓటు కాదు.. రాజకీయ శక్తి

యువజన విభాగాలు పార్టీ జెండాలు మోసే విభాగాలుగా కాకుండా.. రేపటి నాయకత్వాన్ని తయారు చేసే రాజకీయ పాఠశాలలుగా మారాలి. యువత సమస్యలను ఎన్నికల హామీలుగా కాకుండా.. ప్రభుత్వ విధానాలుగా మార్చాలి. అప్పుడు మాత్రమే 'యువతే భవిష్యత్తు' అన్న మాటకు అర్థం ఉంటుంది. లేకపోతే ఎన్నికల ముందు యువతను గుర్తు చేసుకోవడం.. ఎన్నికలు పూర్తయ్యాక మళ్లీ మర్చిపోవడం.. అదే పాత రాజకీయ చక్రం తిరుగుతూనే ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితి అంత సులభంగా ఉండకపోవచ్చు. జెన్‌జీ తరం మౌనంగా ఓటు వేసే తరం కాదు. తన ఓటుకు కారణం వెతుక్కునే తరం. తన భవిష్యత్తుకు హామీ కోరే తరం. ఇచ్చిన మాటకు లెక్క అడిగే తరం. అవసరమైతే అధికారాన్ని ప్రశ్నించే తరం. అందుకే జంతర్ మంతర్ నుంచి మొదలైన ప్రకంపనలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 'జైకొట్టు'గా వినిపిస్తున్నాయా? 'యువగళం'గా మారుతున్నాయా? 'ఉద్యమం'గా రూపాంతరం చెందుతున్నాయా? అన్నది పక్కన పెడితే.. ఒక విషయం మాత్రం స్పష్టం. రాజకీయ పార్టీలకు ఇక యువత ఒక ఓటు కాదు. ఒక శక్తి. ఆ శక్తిని ఎవరు అర్థం చేసుకుంటారు? ఎవరు గౌరవిస్తారు? ఎవరు అవకాశాలుగా మారుస్తారు? ఎవరు భవిష్యత్తుకు బాట వేస్తారు? 2029లో అసలు తీర్పు అక్కడే ఉంటుంది. అందుకే ఇప్పుడు పార్టీలన్నీ యువత వైపు చూస్తున్నాయి. కానీ చివరికి యువత ఎవరి వైపు చూస్తుందో మాత్రం జెండా నిర్ణయించదు. జైకొట్టు నిర్ణయించదు. యువగళం నిర్ణయించదు. ఉద్యమ నినాదాలు కూడా నిర్ణయించవు. యువత చేతిలోని ఓటు.. వారి జీవితంలో కనిపించే ఫలితం.. ఈ రెండే నిర్ణయిస్తాయి. అందుకే ఇది కేవలం పార్టీల 'యువత జైకొట్టు' కాలం కాదు. యువత రాజకీయ పార్టీలకు జైకొట్టే కాలం నుంచి.. రాజకీయ పార్టీల పనితీరుకు యువత మార్కులు వేసే కాలం మొదలైంది!

# తప్పు ఎవరిది.. శిక్ష ఎవరికి?

## రూ.22 వేల కోట్లకు రూ.6.5 కోట్లు!

- పెద్దలకు రుణరాజ్యం.. సామాన్యులకు శిక్షలా?
- ఒకే దేశం.. రెండు రకాల రుణ న్యాయం




**దేశవ్యాప్తంగా ఇప్పుడు ఒక కీలక ప్రశ్న చర్చకు వస్తోంది. రూ.22,006.57 కోట్ల మేరకు నమోదైన రుణదాతల క్లెయిమ్‌లకు వ్యక్తిగత దివాలా పరిష్కారంలో కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే ప్రతిపాదన ఎలా వచ్చింది? ఈ ప్రశ్నకు కారణం జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రకు సంబంధించిన వ్యక్తిగత దివాలా వ్యవహారం. ఆగస్టు 25న ఎన్సీఎల్టీ సభ్యుడు ప్రతిపాదనకు అనుమతి ఇచ్చారు. అయితే సెప్టెంబర్ 1న ఐదుగురు సభ్యుల ప్రత్యేక బెంచ్ ఆ ఆమోదాన్ని నిలిపివేసింది. గత ఉత్తర్వుల్లో స్పష్టమైన మెజారిటీ లేదని చెబుతూ సుభాష్ చంద్ర ఆస్తుల విక్రయం లేదా బదిలీపై కూడా ఆంక్షలు విధించింది. అందువల్ల “రూ.22 వేల కోట్ల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది” అనడం ప్రస్తుతం సరైన వాస్తవం కాదు. ఇది బయటకు, కేంద్ర ప్రభుత్వం నేరుగా చేసిన రుణమాఫీ కాదనిపిస్తున్నా.. అందరూ ప్రభుత్వంపైనే వేలెత్తి చూపెడుతున్నారు. వ్యక్తిగత గ్యారంటర్‌గా ఉన్న సుభాష్ చంద్రకు సంబంధించిన దివాలా పరిష్కార ప్రక్రియపై ఇప్పుడు దేశమంతా ప్రశ్నిస్తోంది. రూ.22,006.57 కోట్ల క్లెయిమ్‌లకు రూ.6.25 కోట్లు మాత్రమే రుణదాతలకు, మరో రూ.25 లక్షలు దివాలా ప్రక్రియ ఖర్చులకు కలిపి మొత్తం రూ.6.5 కోట్లు చెల్లించే ప్రణాళిక ముందుకు వచ్చింది. అంటే రుణదాతల క్లెయిమ్‌లతో పోలిస్తే వసూళ్లు దాదాపు 0.03 శాతమే. దాదాపు 99.97 శాతం భారీ తగ్గింపు కనిపిస్తోంది. ఈ గణాంకమే సామాన్య ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. ఒక సాధారణ రైతు లక్ష రూపాయల రుణం చెల్లించలేకపోతే నోటీసులు, వడ్డీలు, రికవరీ ఒత్తిళ్లు ఎదుర్కొంటాడు. ఒక చిన్న వ్యాపారి ఐదు లక్షల రుణం తీసుకుని వ్యాపారం విఫలమైతే బ్యాంకు ఒత్తిడి మొదలవుతుంది. మరి వేల కోట్ల కార్పొరేట్ రుణాల విషయంలో ఇంత భిన్నమైన లెక్కలు ఎందుకు కనిపిస్తున్నాయనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవసరం.**



### రూ.22 వేల కోట్లు అంటే అసలు ఏమిటి?

ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని స్పష్టంగా చూడాలి. రూ.22,006.57 కోట్లు అంటే సుభాష్ చంద్ర వ్యక్తిగతంగా అంత మొత్తాన్ని బ్యాంకుల నుంచి అప్పుగా తీసుకున్నారనే అర్థం కాదు. ఆయన కొన్ని కార్పొరేట్ రుణాలకు వ్యక్తిగత గ్యారంటర్‌గా ఉన్నారు. కంపెనీలు తీసుకున్న రుణాలకు ప్రమోటర్ వ్యక్తిగత హామీ ఇవ్వడం సాధారణ కార్పొరేట్ వ్యవస్థలో కనిపించే విధానం. కంపెనీ రుణం చెల్లించలేకపోతే కొన్ని పరిస్థితుల్లో గ్యారంటర్‌పై కూడా బాధ్యత వస్తుంది. సుభాష్ చంద్ర కేసులో ఎన్సీఎల్టీ వద్ద నమోదైన క్లెయిమ్‌ల మొత్తం భారీగా ఉన్నప్పటికీ, ఆయన తరఫు వాదన ప్రకారం వ్యక్తిగత గ్యారంటీకి సంబంధించిన వాస్తవ క్లెయిమ్ చాలా తక్కువగా ఉందని చెబుతున్నారు. ఐబీబీఐ గణాంకాలపై వచ్చిన వివరాల ప్రకారం ఆయన వ్యక్తిగత గ్యారంటీకి సంబంధించిన క్లెయిమ్ సుమారు రూ.3,992 కోట్లేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే కారణంగా “రూ.22 వేల కోట్లు అప్పు తీసుకుని రూ.6.5 కోట్లు మాత్రమే చెల్లించాడు” అనే సూటి ప్రచారం వెనుక ఉన్న న్యాయపరమైన నిర్మాణాన్ని కూడా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. అయినా ప్రశ్న మాత్రం తప్పదు. రుణదాతల పుస్తకాలలో ఇంత భారీ క్లెయిమ్ నమోదై ఉంటే, వ్యక్తిగత ఆస్తుల నుంచి రికవరీగా కేవలం రూ.6.25 కోట్లకు పరిష్కారం ఎందుకు వస్తోంది? రుణదాతలు అంగీకరించినా, వ్యతిరేకించినా ఆ ప్రక్రియలో ఎవరి ప్రయోజనం ఎంతవరకు రక్షించబడుతోంది? ప్రజల డబ్బుతో నడిచే బ్యాంకులు భారీ మొత్తాలను రుణాలుగా ఇచ్చినప్పుడు, చివరికి వసూలయ్యే మొత్తం ఎంత? ఆ నష్టం ఎవరు భరిస్తారు? అనే ప్రశ్నలు సహజంగానే వస్తాయి. అంతేకాదు, ఈ ప్రణాళికకు రుణదాతల కమిటీలో 80.81 శాతం ఓటింగ్ విలువ మద్దతు ఇచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. మరోవైపు కొందరు రుణదాతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఐదు కుటుంబ సంబంధిత సంస్థలకు కలిపి 61.78 శాతం ఓటింగ్ హక్కు ఉందని వ్యతిరేకించిన రుణదాతలు ఆరోపించారు. ఆ ఆరోపణలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ఇక్కడే పారదర్శకత, రుణదాతల ప్రయోజనం, దివాలా చట్టం అమలు తీరు కీలకంగా మారుతున్నాయి.

### • మాల్యా ప్రశ్న.. బ్యాంకింగ్‌పై మరో మంట

ఈ పరిణామం మధ్య పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా చేసిన వ్యాఖ్యలు మరో పెద్ద చర్చకు తెరతీశాయి. సుభాష్ చంద్ర పరిష్కారాన్ని ప్రస్తావిస్తూ “ఇండియన్ డెట్ రిజల్యూషన్ జస్టిస్” అంటూ మాల్యా వ్యంగ్యంగా ప్రశ్నించారు. తన విషయంలో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ బ్యాంకులు చెప్పిన రికవరీ గణాంకాలపై చాలా కాలంగా ప్రశ్నలు లేవనెత్తుతున్నానని గుర్తుచేశారు. తనపై రూ.6,203 కోట్ల జడ్జ్‌మెంట్ డెట్ ఉన్న సమయంలో ప్రభుత్వం తన ఆస్తుల నుంచి రూ.14,100 కోట్ల వరకు రికవరీ చేసినట్లు చెప్పిందని మాల్యా పేర్కొన్నారు. గతంలో పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపిన గణాంకాలను కూడా ఆయన ప్రస్తావించారు. మరోవైపు బ్యాంకులు చెప్పిన రికవరీ మొత్తం వేరుగా ఉందని ఆయన ఆరోపించారు. రూ.14,100 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? బ్యాంకుల లెక్కల్లో మరో మొత్తం ఎందుకు కనిపిస్తోంది? ఇంకా బాకీ ఎంత? రికవరీ అయిన డబ్బు ఏ ఖాతాలో జమైంది? అంటూ ఆయన స్వతంత్ర దర్యాప్తు కోరారు. మాల్యా స్వయంగా బ్యాంకు రుణ వివాదంలో నిందితుడిగా ఉండటం వల్ల ఆయన ఆరోపణలను తుది నిజంగా తీసుకోలేం. కానీ ఆయన లేవనెత్తిన ప్రశ్నలలో ఒకటి మాత్రం వ్యవస్థకు సంబంధించినది. బ్యాంకులు, ప్రభుత్వం, న్యాయ సంస్థలు ఒకే రుణంపై వేర్వేరు గణాంకాలు చెబితే సామాన్యుడికి నమ్మకం ఎలా వస్తుంది? ఇదే సమయంలో కేంద్రం తెలిపిన అధికారిక వివరాల ప్రకారం 2025 అక్టోబర్ 31 నాటికి 15 మందిని ఫ్యూజిటివ్ ఎకనామిక్ ఆఫెండర్లుగా ప్రకటించారు. వారిలో తొమ్మిది మంది ప్రభుత్వ రంగ బ్యాంకులకు భారీ ఆర్థిక నష్టాలకు సంబంధించిన కేసుల్లో ఉన్నారు. వారి కేసుల్లో అసలు నష్టం రూ.26,645 కోట్లు, వడ్డీ రూ.31,437 కోట్లుగా పేర్కొనబడింది. ఇప్పటివరకు రూ.19,187 కోట్ల రికవరీ జరిగినట్లు కేంద్రం తెలిపింది. అంటే పెద్ద రుణాల సమస్య కేవలం ఒక్క సుభాష్ చంద్ర లేదా విజయ్ మాల్యా వ్యవహారం కాదు. బ్యాంకింగ్ వ్యవస్థలో భారీ రుణాలు, ఎన్పీఏలు, గ్యారంటీలు, ఆస్తుల వేలం, దివాలా పరిష్కారాలు, రికవరీల లెక్కలు మొత్తం ప్రజల డబ్బుతో ముడిపడి ఉన్నాయి.

### • రుణ వ్యవస్థపై నమ్మకం ఎక్కడ?

బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకం నిలబడేది ఒకే ఒక అంశంపై కాదు. రుణం ఇచ్చే విధానం, రుణం తిరిగి వసూలు చేసే విధానం, డిఫాల్ట్ అయినప్పుడు తీసుకునే చర్యలు, దివాలా పరిష్కారం, రికవరీ గణాంకాలు అన్నీ పారదర్శకంగా ఉంటేనే విశ్వాసం పెరుగుతుంది. భారతదేశంలో బ్యాంకుల జాతీయీకరణ తర్వాత సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరించింది. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు రుణాలు అందించే విధానం కూడా బలపడింది. అదే సమయంలో పెద్ద పరిశ్రమలకు భారీ రుణాలు ఇచ్చే వ్యవస్థ కూడా కొనసాగింది. సమస్య రుణం ఇవ్వడంలో మాత్రమే లేదు. రుణం ఇచ్చే ముందు రిస్క్ అంచనా ఎంత కచ్చితంగా జరిగింది? ప్రమోటర్ సామర్థ్యం ఎలా పరిశీలించారు? గ్యారంటీలు ఏ మేరకు తీసుకున్నారు? రుణం ఎక్కడ ఉపయోగించారు? ఖాతా ఎన్పీఏగా మారిన తర్వాత బ్యాంకు ఎంత త్వరగా చర్య తీసుకుంది? చివరికి ప్రజల డబ్బులో ఎంత తిరిగి వచ్చింది? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం. ఒకవైపు చిన్న రుణగ్రహీతకు వడ్డీ, జరిమానాలు, రికవరీ ఒత్తిడి ఉంటే మరోవైపు వేల కోట్ల క్లెయిమ్‌ల విషయంలో అత్యల్ప మొత్తంతో పరిష్కారం కనిపిస్తే ప్రజల్లో అనుమానం రావడం సహజం. అదే సమయంలో ప్రతి భారీ హేర్‌కట్‌ను “రుణమాఫీ”గా పిలవడం కూడా సరైంది కాదు. దివాలా చట్టం ఉద్దేశం ఆర్థికంగా విఫలమైన సంస్థలు, వ్యక్తుల ఆస్తులను చట్టపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించడం. రుణదాతల వాణిజ్య నిర్ణయానికి కూడా చట్టం ప్రాధాన్యం ఇస్తుంది. కానీ ఆ ప్రక్రియలో ప్రజల డబ్బు ఎంత నష్టపోయింది? ఆ నష్టానికి కారణం ఎవరు? బాధ్యత ఎవరిపై? సంబంధిత పక్షాలు నిర్ణయ ప్రక్రియలో ఎలా పాల్గొన్నాయి? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉంది. సుభాష్ చంద్ర కేసులోనే కొందరు రుణదాతలు వ్యతిరేకించగా, వారి అభ్యంతరాలు ఏమిటో, ఓటింగ్ నిర్మాణం ఎలా ఉందో, గ్యారంటీ బాధ్యత ఎంత వరకు ఉందో ప్రజలకు సులభమైన భాషలో వివరించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న ఎన్సీఎల్టీ ఆమోదాన్ని నిలిపివేయడం వల్ల ఈ వ్యవహారం ఇంకా ముగియలేదనే విషయం కూడా స్పష్టమైంది.

### • తప్పు పెద్దలది.. భారం ప్రజలదా?

ఈ మొత్తం వ్యవహారం చెప్పే అసలు విషయం ఒక్కటే.. దేశంలో రుణ వ్యవస్థకు రెండు ముఖాలు కనిపిస్తున్నాయా? అన్నదే. వేల కోట్ల రుణాలు ప్రమాదంలో పడితే పరిష్కారాలు, చర్చలు, న్యాయ ప్రక్రియలు, సెటిల్‌మెంట్లు ఉంటాయి. అదే చిన్న రైతు, చిన్న వ్యాపారి రుణం చెల్లించలేకపోతే అతని మెడపై వడ్డీ భారం, నోటీసులు, రికవరీ ఒత్తిడి పడుతుంది. ఇదే వ్యవస్థపై సామాన్యుడి అనుమానానికి కారణం. సుభాష్ చంద్ర కేసు తుది పరిష్కారం ఏమవుతుందన్నది పక్కన పెడితే, రూ.22 వేల కోట్లకు పైగా క్లెయిమ్‌ల మధ్య అత్యల్ప మొత్తంతో వచ్చిన పరిష్కార ప్రతిపాదన ప్రజల్లో సహజంగానే ఎన్నో ప్రశ్నలు రేపుతోంది. విజయ్ మాల్యా లేవనెత్తిన రికవరీ లెక్కల వివాదం కూడా అదే అనుమానాన్ని మరింత పెంచుతోంది. తప్పు చేసినవారిని కాపాడాలన్నది కాదు.. నిజాయితీగా విఫలమైనవారిని నాశనం చేయాలన్నదీ కాదు. కానీ ప్రజల డబ్బుకు మాత్రం ప్రతి పైసాకు లెక్క ఉండాలి. బ్యాంకులు భారీ రుణాలు ఇచ్చే ముందు బాధ్యత వహించాలి. రుణాలు విఫలమైనప్పుడు కారణాలు బయటపడాలి. రికవరీ ఎంత జరిగిందో స్పష్టంగా చెప్పాలి. చిన్నవాడికి కూడా పెద్దవాడికి ఉన్నట్టే న్యాయపరమైన రక్షణ, పునర్వ్యవస్థీకరణ అవకాశం ఉండాలి. లేకపోతే చట్టం అందరికీ ఒకటే అన్న నమ్మకం కాగితాలపైనే మిగిలిపోతుంది. వ్యవస్థలోని అసలు దౌర్భాగ్యం అదే.

### • సుభాష్ చంద్ర కేసు నేర్పే పాఠం

పెద్దలకు ఉన్న సౌకర్యాలు చిన్నవారికీ ఉండాలి. సుభాష్ చంద్ర రుణ పరిష్కార వ్యవహారం దేశంలో రుణ వ్యవస్థపై కీలక చర్చకు దారితీసింది. పెద్ద పారిశ్రామికవేత్తలు వేల కోట్ల రుణాల సమస్యను ట్రిబ్యునళ్లు, న్యాయవాదులు, న్యాయపరమైన మార్గాల ద్వారా ఎదుర్కొనే అవకాశం పొందుతున్నారు. అదే అవకాశం రైతులు, చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపారులకు ఎందుకు ఉండకూడదన్నదే ప్రధాన ప్రశ్న అని ఆయన స్పష్టం చేశారు. రైతు, చిన్న వ్యాపారి పరిస్థితిని చూడాలి. ఒక రైతు లక్ష రూపాయల రుణం తీసుకుని పంట నష్టంతో చెల్లించలేకపోతే అతని పరిస్థితి దయనీయంగా మారుతుంది. ఐదు, పది లక్షలతో చిన్న పరిశ్రమ ప్రారంభించిన వ్యక్తి వ్యాపారం విఫలమైతే మరింత ఇబ్బందులు ఎదుర్కొంటాడు. ప్రతి రుణగ్రహీతను మోసగాడిగా చూడకుండా, నిజాయితీగా విఫలమైన వారికి రుణ పునర్వ్యవస్థీకరణ, చట్టపరమైన రక్షణ కల్పించాలి అని ఆయన సూచించారు. స్వయం ఉపాధిని కాపాడాలి. దేశంలో ప్రభుత్వ ఉద్యోగాలు అందరికీ సాధ్యం కావు. అందుకే రైతులు, చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలు స్వయం ఉపాధికి కీలకం. పెద్దలకు లభించే రుణ పరిష్కార సౌకర్యాలను చిన్నవారికీ అందుబాటులోకి తీసుకురావాలి. వ్యవస్థ పారదర్శకంగా ఉండాలి. ప్రజల నమ్మకం నిలబడాలంటే రుణాల విషయంలో సమాన న్యాయం తప్పనిసరి చేయాలి.



### • రైతు రుణం.. చిన్న వ్యాపారి కష్టం

ఇక్కడే అసలు సామాజిక ప్రశ్న మొదలవుతుంది. ఒక రైతు పంట కోసం లక్ష రూపాయలు అప్పు తీసుకున్నాడనుకుందాం. వర్షాలు విఫలమయ్యాయి. పంట నష్టపోయింది. మార్కెట్ ధర పడిపోయింది. అతను రుణం చెల్లించలేకపోయాడు. బ్యాంకు నుంచి నోటీసు వస్తుంది. వడ్డీ పెరుగుతుంది. రుణ పునర్వ్యవస్థీకరణ కోసం అతను అధికారుల చుట్టూ తిరగాలి. న్యాయపరమైన పోరాటం చేయాల్సి వస్తే న్యాయవాది ఖర్చు కూడా భరించాలి. ఇదే పరిస్థితి ఐదు లక్షలు, పది లక్షలు పెట్టుబడి పెట్టి చిన్న పరిశ్రమ ప్రారంభించిన వ్యక్తికీ రావచ్చు. చిన్న వ్యాపారి వైఫల్యం అంటే కుటుంబం మొత్తం ఆర్థికంగా కుదేలయ్యే ప్రమాదం. పెద్ద కార్పొరేట్ రుణం విఫలమైతే మాత్రం బ్యాంకులు, న్యాయవాదులు, ఆర్థిక నిపుణులు, పునర్వ్యవస్థీకరణ నిపుణులు, దివాలా నిపుణులు మొత్తం ప్రక్రియలో భాగమవుతారు. ఇది తప్పనిసరిగా చట్ట విరుద్ధం కాదు. పెద్ద కేసులు సంక్లిష్టంగా ఉంటాయి. అయితే న్యాయపరమైన సౌకర్యం, ఆర్థిక సామర్థ్యం, నిపుణుల సహాయం పెద్దవారికి ఎక్కువగా అందుబాటులో ఉండటం చిన్న రుణగ్రహీతలతో పోలిస్తే స్పష్టమైన అసమానతను సృష్టిస్తుంది. అందుకే ప్రభుత్వం ఆలోచించాల్సింది “పెద్దవారికి ఎందుకు అవకాశం?” అనే ప్రశ్నతో మాత్రమే ఆగిపోవడం కాదు. “అదే రక్షణ చిన్న రైతుకు ఎందుకు ఉండకూడదు? చిన్న పరిశ్రమకు ఎందుకు ఉండకూడదు? చిన్న వ్యాపారికి ఎందుకు ఉండకూడదు?” అనే ప్రశ్న కూడా ముందుకు రావాలి. వ్యాపారం విఫలమవడం, పంట విఫలమవడం ప్రతిసారీ మోసం కాదు. ఉద్దేశపూర్వకంగా బ్యాంకును మోసం చేసినవారికి కఠిన చర్య తప్పనిసరి. కానీ నిజాయితీగా వ్యాపారం చేసి మార్కెట్ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక మాంద్యం వల్ల నష్టపోయినవారికి చట్టబద్ధమైన పునరుద్ధరణ మార్గం ఉండాలి. దేశంలో స్వయం ఉపాధి పెరగాలంటే వైఫల్యానికి కూడా ఒక న్యాయమైన రెండో అవకాశం అవసరం. రైతు, చిన్న పరిశ్రమ, చిన్న వ్యాపారి రుణం విషయంలో ఇదే సూత్రం అమలవ్వాలి.

### • పెద్దలకో న్యాయం.. చిన్నలకో న్యాయమా?

ఇప్పుడు దేశం అడగాల్సిన అసలు ప్రశ్న ఇదే. ఎవరి డబ్బు? ఎవరి రిస్క్? ఎవరి నష్టం? ఎవరి బాధ్యత? బ్యాంకుల్లో ఉన్న డబ్బు కేవలం బ్యాంకు యాజమాన్యానిది కాదు. కోట్లాది డిపాజిటర్ల పొదుపులతో బ్యాంకింగ్ వ్యవస్థ నడుస్తుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల విషయంలో ప్రజా ధనం కూడా అంతర్భాగమే. కాబట్టి వేల కోట్ల రుణాలు సమస్యగా మారినప్పుడు దాని ప్రభావం చివరికి ఆర్థిక వ్యవస్థపైనే పడుతుంది. అదే సమయంలో రైతులకు, చిన్న వ్యాపారులకు, సూక్ష్మ పరిశ్రమలకు రుణాలు అందకుండా పోతే స్వయం ఉపాధి బలహీనపడుతుంది. పెద్ద రుణగ్రహీతకు దివాలా చట్టం కింద పునరుద్ధరణకు అవకాశం ఉంటే, చిన్న రుణగ్రహీతకు కూడా సరళమైన రుణ పునర్వ్యవస్థీకరణ వ్యవస్థ ఉండాలి. బ్యాంకు రుణం తీసుకున్న రైతు లేదా చిన్న వ్యాపారి కోర్టు మెట్లు ఎక్కే స్థోమత లేకపోతే ప్రభుత్వం ఉచిత న్యాయ సహాయం, ఆర్థిక సలహా, రుణ పునర్వ్యవస్థీకరణకు ప్రత్యేక వ్యవస్థ తీసుకురావాలి. నిజమైన మోసగాళ్లపై కఠిన చర్యలు ఉండాలి. ఉద్దేశపూర్వక డిఫాల్టర్ల ఆస్తులపై వేగంగా చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో నిజాయితీగా వ్యాపారం చేసి విఫలమైనవారికి పునరావాస మార్గం ఇవ్వాలి. ఒక వ్యవస్థ బలంగా ఉండాలంటే పెద్దవారిని శిక్షించడం మాత్రమే కాదు, చిన్నవారిని రక్షించడం కూడా ముఖ్యం. సుభాష్ చంద్ర కేసు ఇప్పటికి న్యాయపరమైన ప్రక్రియలోనే ఉంది. కాబట్టి దీనిని తుది రుణమాఫీగా ప్రకటించడం కంటే, ఈ కేసు లేవనెత్తిన వ్యవస్థాపరమైన ప్రశ్నలను పరిశీలించడం ముఖ్యం. విజయ్ మాల్యా లేవనెత్తిన రికవరీ గణాంకాల ప్రశ్నలకు కూడా ప్రభుత్వం, బ్యాంకులు ఒకే స్పష్టమైన ఖాతా చూపించాలి. రుణం ఎంత? రికవరీ ఎంత? వడ్డీ ఎంత? ఆస్తుల విలువ ఎంత? నష్టం ఎంత? చివరికి ప్రజలపై భారం ఎంత? అన్న లెక్కలు బహిరంగంగా అందుబాటులో ఉండాలి. లేదంటే పెద్దలకు ఒక న్యాయం, చిన్నవారికి మరో న్యాయం అనే భావన మరింత బలపడుతుంది. దేశాన్ని కేవలం సంక్షేమ పథకాలతో నడపలేం. అలాగే పెద్ద కార్పొరేట్ రుణాల నష్టాలను కూడా సామాన్య ప్రజల భుజాలపై మోపలేం. రైతుకు రుణం అందాలి. చిన్న పరిశ్రమకు మూలధనం అందాలి. నిజాయితీగా పనిచేసే వ్యాపారికి రెండో అవకాశం రావాలి. అదే సమయంలో ప్రజల డబ్బుతో ఇచ్చిన భారీ రుణాలకు బాధ్యత కూడా ఖరారు కావాలి. ఈ సమతుల్యతే భారత ఆర్థిక వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెడుతుంది. లేకపోతే ప్రశ్న ఒక్కటే మిగులుతుంది. దేశం ఎవరిది? రుణ వ్యవస్థ ఎవరి కోసం? సామాన్యుడికి న్యాయం ఎక్కడ?





- డాక్టర్ పెంటపాటి పుల్లారావు,
రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు



కాంగ్రెస్‌ను కబ్జా కానివ్వను..

రాజగోపాల్ అడ్డుగోడగా నిలుస్తాడు

# టైమొస్తే.. సీఎం అవుతా..

## బ్రహ్మదేవుడూ ఆపలేడు

- రియల్ కాంగ్రెస్‌పై కొత్తవాళ్ల పెత్తనం సహించం!
- కాంగ్రెస్ రక్తమే.. వైఎస్సార్ స్ఫూర్తే మా బలం
- కుట్రలెన్ని చేసినా.. హస్తాన్ని వదిలేది లేదన్న రాజన్న

### సీఎం అయ్యే టైమొస్తే..
## ఆపలేరు

**తన రాజకీయ భవిష్యత్తుపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరింత చర్చనీయాంశంగా మారాయి. తనకు సీఎం అయ్యే సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పదవిని వ్యక్తిగత గౌరవంగా కాకుండా బాధ్యతగా చూస్తానన్నారు. పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి పనిచేస్తానని చెబుతూనే.. తనను, తనలాంటి నిజాయితీ గల నాయకులను అవమానించే ప్రయత్నాలను మాత్రం సహించబోమని హెచ్చరించారు.**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలతో రాజకీయ వేడిని పెంచారు. కాంగ్రెస్ పార్టీతో తన అనుబంధాన్ని ప్రస్తావిస్తూ.. ఎన్ని నిందలు వేసినా, ఎన్ని కుట్రలు చేసినా తమది కాంగ్రెస్ రక్తమేనని స్పష్టం చేశారు. తాను వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానినని, ఆయన శిష్యుడినని గర్వంగా చెప్పుకున్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చామని, ఆయన ఆశయాల కోసం పనిచేస్తామని తెలిపారు.

**కాంగ్రెస్‌ను ఎవరూ కబ్జా చేయలేరు**

కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి నాయకులు రావడాన్ని తాను వ్యతిరేకించడం లేదని రాజగోపాల్ రెడ్డి చెప్పారు. పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నుంచి వచ్చినవారిని ఆహ్వానించాల్సిందేనన్నారు. అయితే.. తమ ఇంట్లోకి వచ్చి తమనే బయటకు పంపే పరిస్థితిని మాత్రం సహించబోమని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించిన ఆయన.. తాను ఉన్నంతకాలం కాంగ్రెస్‌ను ఎవరూ కబ్జా చేయలేరని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్‌లోనే ఉండి పోరాడిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం దక్కడం లేదన్నది తన ఆవేదన అని ఆయన వివరించారు. పదేళ్ల పాటు ఇతర పార్టీలకు వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలకు చివరి నిమిషంలో ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి టికెట్లు ఇవ్వడం వల్ల అన్యాయం జరుగుతోందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉందని, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలను గౌరవించాల్సిన బాధ్యత అధిష్టానంపై ఉందన్నారు.

**పదవి కోసం నేను పనిచేయలేదు**

తన వ్యాఖ్యలు ఎవరి మీద వ్యక్తిగత కోపంతో చేస్తున్నవి కావని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల ప్రయోజనాలు, తెలంగాణ ఆత్మగౌరవం కోసమే తాను మాట్లాడుతున్నానన్నారు. ఈ అంశాలను రాహుల్ గాంధీ, మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం ఈ సమస్యలను పరిశీలించి కార్యకర్తలను కాపాడుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో పదవి కోసం ఎప్పుడూ పనిచేయలేదని రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్‌లోనే ఉంటూ కేంద్ర నాయకత్వాన్ని ఎదిరించిన సందర్భాలను గుర్తుచేశారు. అనంతరం కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన ఎంపీ పదవికి రాజీనామా చేసి మునుగోడు ప్రజల వద్దకు వెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజల కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం తన రాజకీయ ప్రయాణం కొనసాగుతుందని చెప్పారు.

**తెలంగాణలో రాజశేఖరరెడ్డి యుగం**

వైఎస్సార్ వారసత్వాన్ని ప్రస్తావిస్తూ తెలంగాణలో మళ్లీ రాజశేఖరరెడ్డి యుగం రాబోతుందని రాజగోపాల్ రెడ్డి ప్రకటించారు. వైఎస్సార్ అభిమానులు, ఆయన శిష్యులు, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు తాను అండగా ఉంటానన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో, రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి తిరిగి అధికారంలోకి తీసుకువస్తామని చెప్పారు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు కేవలం పార్టీ అంతర్గత అసంతృప్తి వ్యక్తీకరణగా కాకుండా.. తన రాజకీయ భవిష్యత్తుపై చేసిన బలమైన ప్రకటనగా రాజకీయ వర్గాలు చూస్తున్నాయి. ఒకవైపు కాంగ్రెస్‌లో ఒరిజినల్ కార్యకర్తల హక్కుల కోసం గళమెత్తుతూనే.. మరోవైపు తనకు సీఎం పదవి దక్కే సమయం వస్తుందన్న ధీమాను బహిరంగంగా వ్యక్తం చేయడం తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త చర్చకు తెరలేపింది.









## వరద బీభత్సంలో సోనూసూద్ అండ

**బాధితుల కోసం కాఠ్మాండూ పయనం**

నేపాల్‌లో వరదలు సృష్టించిన భారీ విషాదం వేళ నటుడు సోనూసూద్ మానవతా సాయం కోసం రంగంలోకి దిగారు. సూద్ ఛారిటీ ఫౌండేషన్ బృందంతో కలిసి సెప్టెంబర్ 1న కాఠ్మాండూకు చేరుకున్న ఆయన.. బాధితుల కోసం ఆహారం, దుప్పట్లు తీసుకెళ్లారు. ఆగస్టు 26న సంభవించిన వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తున్నారు. “వరద బాధితులను కలవడానికి వచ్చాం. అవసరంలో ఉన్న ప్రజలతో నిలబడతాం. వారి జీవితాలను మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తాం” అని సోనూసూద్ తెలిపారు. తక్షణ సహాయంలో భాగంగా దుప్పట్లు, ఆహార పదార్థాలు అందిస్తున్నామని, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇంకా ఏం అవసరమో తమ బృందం తెలుసుకుంటోందని చెప్పారు.

**నెలల పాటు కొనసాగనున్న సాయం**

నేపాల్‌లోని త్రిశూలి నది పరిసరాల్లో వరదలు మిగిల్చిన విధ్వంసాన్ని సోనూసూద్ స్వయంగా చూశారు. ఇళ్లు, కుటుంబాలు, జీవనోపాధి కోల్పోయిన ప్రజలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన సామగ్రిని భారత్ నుంచి పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒక్క నెలతో సహాయ కార్యక్రమాన్ని ముగించబోమని, రాబోయే నెలల్లోనూ నిరంతరం రిలీఫ్ అందేలా చూస్తామని స్పష్టం చేశారు. నేపాల్ ప్రజలు ఒంటరిగా లేరని భరోసా ఇచ్చారు. వరదల్లో ఇళ్లు కోల్పోయిన చిన్నారులతో కలిసిన ఫొటోలను కూడా ఆయన పంచుకున్నారు. “వారు తమ ఇళ్లు, కుటుంబాలు, బాల్యాన్ని కోల్పోయారు. కలిసి వారికి కొత్త ప్రారంభాన్ని అందించాలి” అనే సందేశాన్ని ఇచ్చారు.

**విషాదం వేళ మానవత్వం**

నేపాల్‌టిబెట్ సరిహద్దు సమీపంలో మంచు, రాళ్ల కుప్ప కూలడంతో ఏర్పడిన ఆకస్మిక వరదలు ఉత్తర, మధ్య నేపాల్‌లోని అనేక పట్టణాలు, గ్రామాలను తీవ్రంగా దెబ్బతీశాయి. వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, వేల మంది గల్లంతయ్యారు. ఇలాంటి విపత్కర సమయంలో సోనూసూద్ చేపట్టిన సహాయక చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విపత్తుల సమయంలో సేవ చేయడం ఆయనకు కొత్త కాదు. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా చిక్కుకున్న వలస కార్మికులను స్వస్థలాలకు చేర్చడంలో కీలకంగా వ్యవహరించారు. 2025లో పంజాబ్ వరదల సమయంలోనూ సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఏడాది దుబాయ్‌లో విమాన అంతరాయాల కారణంగా చిక్కుకున్న ప్రయాణికులకు ఉచిత వసతి కల్పించారు. సినీ నటుడిగా మాత్రమే కాకుండా.. విపత్తు వేళ బాధితులకు అండగా నిలిచే మానవతావాదిగా సోనూసూద్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నరు.

## టీటీడీ డిప్యూటీ ఈఓ ఇండ్లలో దాడులు

**ఆస్తులపై ఏసీబీ ఏకకాల సోదాలు**

తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మెండు లోకనాథం ఆస్తులపై ఏసీబీ అధికారులు బుధవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. తిరుపతిలోని రెండు నివాసాలు, యెర్పేడు మండలంలోని పూర్వీకుల ఇల్లు, తిరుమలలోని ఆయన అధికారిక కార్యాలయంలో సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఆస్తులకు సంబంధించిన పత్రాలు, నగదు, బంగారం, వెండి సహా కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. లోకనాథం ప్రస్తుతం తిరుమల ఆలయ డిప్యూటీ ఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయన కీలక బాధ్యతల్లో పనిచేసినట్లు సమాచారం. ఆలయానికి సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఏసీబీ తదుపరి చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**భారీగా ఆస్తులు, నగదు గుర్తింపు**

నెయ్యి సరఫరాదారులపై ప్రభావం చూపిన ఆరోపణలతో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన కే. చిన్న అప్పన్నపై ఏసీబీ విశాఖపట్నం కేసు నమోదు చేసిన తర్వాత దర్యాప్తు మరింత విస్తరించింది. ఆ విచారణలో వచ్చిన వివరాల ఆధారంగా లోకనాథం ఆస్తులపై సోదాలు నిర్వహించినట్లు ఏసీబీ వెల్లడించింది. తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లో ఆయన భార్య పేరుతో ఇల్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. గోవిందవానిగుంటలో రెండు ఇంటి స్థలాలతో పాటు భవనం, వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం గ్రామంలో ఇంటి స్థలం, శ్రీనివాసపురం రెసిడెన్షియల్ ఏరియాలో మరో స్థలం ఆయన కుమారుడి పేరుతో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బంధువుల పేర్లపై ఉన్న నాలుగు ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా సోదాల్లో బయటపడినట్లు తెలిపారు. ముఖ్యంగా 2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండి, సుమారు రూ.5 కోట్ల విలువైన నగదు గుర్తించినట్లు ఏసీబీ పేర్కొంది. సోదాలు కొనసాగుతున్న సమయంలోనే ఈ వివరాలు వెలుగులోకి రావడంతో, స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఇతర ఆస్తులపై అధికారులు లోతుగా పరిశీలన చేస్తున్నారు.



### లోకనాథంపై ఏసీబీ దాడులు

**టీటీడీలో ఆధిపత్య పోరే కారణమన్న వైసీపీ**

**అనుమానాలు వ్యక్తం చేసిన భూమన**




ఆధిపత్య పోరే కారణమా?

టీటీడీలో అధికారుల మధ్య ఆధిపత్య పోరు ముదిరిందని, దాని ప్రభావంతోనే డిప్యూటీ ఈవో లోకనాథం యాదవ్‌ను లక్ష్యంగా చేసుకున్నారా? అనే అనుమానం కలుగుతోందని మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తూ అవినీతికి తావులేని అధికారిపై ఏసీబీ దాడులు చేయడం ఖండించాల్సిన అంశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 80 మంది అధికారులతో ఆరు నెలలపాటు విచారణ జరిపినా ఎలాంటి అక్రమాలు బయటపడలేదని భూమన పేర్కొన్నారు. చివరకు కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. లోకనాథం యాదవ్‌పై చర్యల వెనుక అసలు కారణం ఏమిటో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీటీడీలో అంతర్గతంగా కొనసాగుతున్న అధికార పోరుతో ఒక అధికారిని టార్గెట్ చేస్తున్నారన్న ప్రచారానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రాబల్యాన్ని తగ్గించేందుకే లోకనాథం యాదవ్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారా అని భూమన ప్రశ్నించారు. ఈవో రవిచంద్ర, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కలిసి అదనపు ఈవో వెంకయ్య చౌదరిపై చర్యలకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన అధికారిని వేధించడం సరికాదన్నారు. లోకనాథం యాదవ్ కుటుంబం ఆర్థికంగా బలమైనదని, ఆయన తాత మునిస్వామి యాదవ్ కోటీశ్వరుడిగా ఉన్నారని చెప్పారు. అందువల్ల సోదాల్లో ఆస్తులు బయటపడటం మాత్రమే అవినీతికి ఆధారంగా చూడకూడదని సూచించారు. నిజాయితీపరుడైన అధికారిపై మచ్చ వేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని, వాస్తవాలు పూర్తిగా వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. టీటీడీ ఉద్యోగులు లోకనాథం యాదవ్‌కు అండగా నిలవాలని భూమన పిలుపునిచ్చారు. టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా అంతర్గత వివాదాలు మారకూడదని స్పష్టం చేశారు.



## నేపాల్‌కు భారత్ భారీ సహాయం..!

**వరద విలయంలో అండగా భారత్**

నేపాల్‌లో వరదలు సృష్టించిన పెను విషాదం వేళ భారత్ మరోసారి భారీ సహాయాన్ని అందించింది. బుధవారం ఐదో విడత సహాయ సామగ్రితో భారత విమానం నేపాల్‌కు బయలుదేరింది. ఇందులో ప్రత్యేక పరికరాలతో కూడిన 11 మంది సభ్యుల రెస్క్యూ బృందం, 5.5 టన్నుల అత్యవసర మందులు ఉన్నాయి. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ విషయాన్ని వెల్లడించారు. వరద బాధితులకు తక్షణ వైద్యం అందించడంతో పాటు గల్లంతైనవారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలకు ఈ బృందం సహకరించనుంది. ఇప్పటికే భారత్ నుంచి నేపాల్‌కు 68 టన్నులకు పైగా సహాయ సామగ్రి చేరింది. వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో పాటు సెర్చ్, రెస్క్యూ కార్యకలాపాలకు అవసరమైన సాంకేతిక బృందాన్ని కూడా భారత్ పంపించింది.

### వెయ్యి దాటిన మరణాలు

నేపాల్‌లో పరిస్థితి మరింత విషాదకరంగా మారింది. బుధవారం నాటికి మృతుల సంఖ్య 1,127కు చేరింది. చిత్వాన్‌లో 348, నావల్‌పరాసి ఈస్ట్‌లో 217, నావల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. గోర్ఖాలో 66, ధాదింగ్‌లో 59, రసువాలో 45, తనాహున్‌లో 38 మృతదేహాలు లభించాయి. ఇప్పటివరకు 1,113 మృతదేహాలకు పోస్టుమార్టం, చట్టపరమైన గుర్తింపు ప్రక్రియ పూర్తైంది. 95 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరోవైపు 911 గుర్తుతెలియని మృతదేహాల వివరాలను నేపాల్ పోలీస్ వెబ్‌సైట్‌లో ఉంచారు. వాటి ద్వారా కుటుంబ సభ్యులు తమవారిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

### వేలాది మంది ఇంకా గల్లంతు

వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. భద్రతా బలగాలు ఇప్పటివరకు 6,541 మందిని రక్షించగా.. మరో 4,858 మంది ఆచూకీ ఇంకా లభించాల్సి ఉంది. ఆగస్టు 26న హిమాలయ దేశంలో ఆకస్మిక వరదలు సంభవించిన వెంటనే భారత్ సహాయక చర్యలు ప్రారంభించింది. అదే రోజు ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో మాట్లాడి అవసరమైన అన్ని మానవతా సహాయాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వరుసగా సహాయ సామగ్రి, వైద్య బృందాలు, రెస్క్యూ సిబ్బందిని భారత్ పంపిస్తోంది. ప్రస్తుతం చేరిన ఐదో విడతలో మందులతో పాటు ప్రత్యేక రెస్క్యూ పరికరాలు ఉండటంతో గాలింపు చర్యలకు మరింత బలం చేకూరనుంది. విపత్తు వేళ పొరుగుదేశానికి భారత్ అందిస్తున్న నిరంతర సహాయం నేపాల్‌కు కీలక అండగా మారింది.

## ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై బీసీసీఐ కొత్త రూల్

### గాయపడిన ఆటగాళ్లపై కఠిన నిర్ణయం



గాయపడిన ఆటగాళ్లను తొందరపెట్టి జాతీయ జట్టులోకి ఎంపిక చేస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో బీసీసీఐ కీలక మార్పు చేసినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇకపై ఆటగాడి ఫిట్‌నెస్‌పై పూర్తిస్థాయి నమ్మకం వచ్చిన తర్వాతే జట్టులోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. తాజాగా అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌కు ప్రకటించిన జట్టులో జస్ప్రీత్ బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా పేర్ల పక్కన ప్రత్యేక గుర్తులు పెట్టడం దీనికి సంకేతంగా కనిపించింది. గతంలో గాయాల నుంచి పూర్తిగా కోలుకోకుండానే కొందరు ఆటగాళ్లు అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఎంపికై, ఆ తర్వాత మళ్లీ జట్టుకు దూరమయ్యారు. దీనిపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై విమర్శలు వచ్చాయి. ఇకపై ఆటగాడి అందుబాటుపై 100 శాతం కాదు, 200 శాతం నమ్మకం వచ్చిన తర్వాతే ఎంపిక చేయాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. అయితే అంతర్జాతీయ సిరీస్‌కు మూడు నాలుగు వారాల ముందే జట్టు ప్రకటించాల్సి ఉండటంతో ఫిట్‌నెస్ షరతుతో ఆటగాళ్లను ఎంపిక చేస్తున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వివరించారు. అఫ్గాన్ సిరీస్‌కు బుమ్రా, నితీశ్ అందుబాటులో ఉండే అవకాశాలున్నా, రాణా, సుందర్ ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత లేదు.

## ధోనీ-పంత్ పార్టీ.. వీడియో వైరల్

### కలిసి కనిపించిన క్రికెట్ లెజెండ్స్



భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ కలిసి పార్టీ చేసుకున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శ్రీలంకతో టెస్ట్ సిరీస్ ముగిసిన తర్వాత స్నేహితులతో జరిగిన గెట్ టుగెదర్‌లో ఇద్దరూ సందడి చేశారు. కెమెరా ముందు నవ్వుతూ ఫోజులిచ్చిన ధోనీ, పంత్‌ను చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో 'ఏ దిల్ హై ముష్కిల్' సినిమాలోని 'చన్నా మేరేయా' పాట వినిపించింది. ఫోటో తర్వాత కొందరు అక్కడి నుంచి వెళ్లిపోగా, సోఫాపై ఉన్న పంత్ వారిని తిరిగి పిలిచాడు. శ్రీలంకతో సిరీస్‌లో భారత్ 10తో విజయం సాధించగా, రెండో టెస్ట్‌లో పంత్ కీలక రికార్డు సాధించాడు. విదేశీ, తటస్థ టెస్టుల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ధోనీని అధిగమించాడు. పంత్ 2,534 పరుగులతో ముందుండగా, ధోనీ 2,496 పరుగులు చేశాడు. టెస్టుల్లో 102 సిక్సర్లతో పంత్ గిల్‌క్రిస్ట్‌ను అధిగమించి మూడో స్థానానికి చేరాడు. మరోవైపు గాయం కారణంగా ధోనీ 2026 ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.

## ఫేక్ న్యూస్ అనుకున్న ఆటగాడు

- పాక్ జట్టులో సంచలనం.. ఏడు వికెట్లు ఔట్
- ఇంగ్లండ్ టూర్ నుంచి స్టార్‌లకు ఉద్వాసన



ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్ వరుస పరాజయాల నేపథ్యంలో పీసీబీ తీసుకున్న సంచలన నిర్ణయం ఆ దేశ క్రికెట్‌లో కలకలం రేపుతోంది. రెండు టెస్టుల్లో ఓటముల తర్వాత ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ ఆఘా, అలీ ఉస్మాన్, ఆమిర్ జమాల్, అవైస్ జాఫర్, ఖుర్రమ్ షహ్‌జాద్‌లకు టూర్ మధ్యలోనే ఉద్వాసన పలికింది. అయితే ఈ నిర్ణయం ఎంత అనూహ్యంగా వచ్చిందో తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. జట్టు నుంచి తొలగించిన ఓ ఆటగాడు తనకు వచ్చిన సమాచారం నిజమని నమ్మలేక, మొదట దాన్ని ఫేక్ న్యూస్‌గా భావించినట్లు తెలుస్తోంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు పీసీబీ ఐదుగురు అన్‌క్యాప్డ్ ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. అరఫాత్ మిన్హాస్, మహ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, మహ్మద్ ఇమ్రాన్ రంధావా, రజాఉల్లా కొత్తగా అవకాశం దక్కించుకున్నారు. వీరితో పాటు సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్ తిరిగి జట్టులోకి వచ్చారు. కొత్తగా చేరిన ఆటగాళ్ల అనుభవం చాలా తక్కువగా ఉండటం పాక్ క్రికెట్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తోంది.

## పాక్ క్రికెట్‌లో భారీ ప్రక్షాళన

### బాబర్- సర్ఫరాజ్‌పై సెలెక్టర్ ఆగ్రహం

ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్ ఘోర ప్రదర్శనపై ఆ దేశ క్రికెట్ బోర్డు సెలెక్షన్ కమిటీ చీఫ్ ఆకిబ్ జావెద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కెప్టెన్ బాబర్ ఆజమ్, కోచ్ సర్ఫరాజ్ అహ్మద్ కీలక నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అందుకే బోర్డు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. జట్టులో పేస్ ఆల్‌రౌండర్, రెండో వికెట్ కీపర్, గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయగల ఉబైద్ షా అందుబాటులో ఉన్నా వారిని సరిగ్గా ఉపయోగించలేదని తెలిపారు. టాప్ 7 బ్యాటర్లలో ఒక్కరూ బౌలింగ్ చేయకపోవడంతో జట్టు కూర్పు దెబ్బతిందన్నారు. సల్మాన్ ఆఘా స్థానంలో గాజీ ఘోరీని, రిజ్వాన్‌కు బదులుగా అతడిని వికెట్ కీపర్‌గా ఆడించాల్సిందని అభిప్రాయపడ్డారు. సిరీస్ ఇప్పటికే కోల్పోవడంతో ఏడు మంది కొత్త ఆటగాళ్లను ఇంగ్లండ్‌కు పంపామని చెప్పారు. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వడం ద్వారా పాకిస్థాన్ క్రికెట్‌లో ప్రతిభ ఉందనే సందేశం ఇవ్వాలనుకుంటున్నామని వివరించారు. కీలక నిర్ణయాలు తీసుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం పోటీ ఇవ్వలేకపోవడంతో ప్రపంచం తమను చూసి నవ్వుతోందని ఆకిబ్ వ్యాఖ్యానించడం పాక్ క్రికెట్‌లో కొత్త చర్చకు దారితీసింది.



## పాక్ బోర్డుపై యూసుఫ్ ఘాటు సెటైర్లు

### ఏడు ఆటగాళ్లు, కోచ్‌ల తొలగింపుపై ఫైర్

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న భారీ మార్పులపై మాజీ బ్యాటర్ మహ్మద్ యూసుఫ్ తీవ్రంగా స్పందించారు. ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు ముందు ఏడు మంది ఆటగాళ్లు, ఇద్దరు కోచ్‌లను తప్పించడం కేవలం ప్రదర్శన ఆధారంగా తీసుకున్న నిర్ణయంలా కనిపించడం లేదన్నారు. జహీర్ అబ్బాస్, జావేద్ మియాందాద్, ఇంజమామ్ ఉల్ హక్, సయీద్ అన్వర్ వంటి దిగ్గజాలను ప్రత్యామ్నాయంగా పంపడం లేదని, అలాంటప్పుడు ఈ చర్యల వెనుక అంతర్గత గందరగోళమే కనిపిస్తోందని యూసుఫ్ ఎద్దేవా చేశారు. 1992 ప్రపంచకప్ తర్వాత నుంచి పాక్ క్రికెట్‌లో వివాదాలు, అభిప్రాయ భేదాలు, అస్థిరత పదేపదే కొనసాగుతున్నాయని వ్యాఖ్యానించారు. బోర్డు గదుల్లో కాకుండా మైదానంలో దృష్టి పెట్టాలని సూచించారు. వరుస విజయాలే విమర్శలకు సరైన సమాధానమని స్పష్టం చేశారు. మరోవైపు మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సెలెక్షన్ కమిటీకి రాజీనామా చేయగా, బోర్డు ఇంకా ఆమోదించలేదు. రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ ఎంపికపై సెలెక్టర్లను వివరణ కోరినట్లు సమాచారం. ఇంగ్లండ్ చేతిలో వరుసగా రెండు టెస్టులు ఓడిన పాకిస్థాన్ 202527 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో అట్టడుగున ఉంది.



# సంకల్ప సాధకుడు పవన్

### తమ్ముడికి అన్న చిరు బర్త్‌డే విషెస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనకు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను 'సంకల్ప సాధకుడు' అంటూ సంబోధిస్తూ చిరంజీవి రాసిన భావోద్వేగ లేఖ నెట్టింట ప్రస్తుతం వైరల్‌గా మారింది. తమ్ముడు పవన్‌లో చిన్నప్పటి నుంచే నిబద్ధత, ప్రజలకు మంచి చేయాలనే తపన తాను చూస్తున్నానని చిరంజీవి పేర్కొన్నారు. కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తారో, తనను నమ్మిన ప్రజల పట్ల కూడా పవన్ అంతే వాత్సల్యం చూపుతారని కొనియాడారు. ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ అంకితభావంతో పనిచేస్తున్న తీరు తనలో ఎంతో గర్వాన్ని కలిగిస్తోందని చిరు తెలిపారు. పిఠాపురం ప్రజలకు ఒక ప్రజాప్రతినిధిలా కాకుండా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, ప్రజలందరూ మెచ్చే నాయకుడిగా తన లక్ష్యాలను సాధించాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంటూ 'ఇట్లు మీ అన్నయ్య చిరంజీవి' అంటూ ఆప్యాయంగా బర్త్‌డే విషెస్ అందజేశారు.

### పవన్ ప్రత్యే ఫోటోతో బన్నీ శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కెరీర్ ఆరంభం నాటి క్లాసిక్, స్టైలిష్ లుక్‌తో కూడిన ఒక వింటేజ్ పోస్టర్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. 90ల నాటి సినిమా స్టిల్లా అన్నట్లుగా ఉన్న ఈ క్రేజీ ఫొటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో పవన్ కల్యాణ్ ఒత్తుగా ఉన్న కర్లీ హెయిర్, షార్ప్ లుక్ మరియు బ్లాక్ టీ 'షర్ట్‌తో సరికొత్త స్టైష్ వైబ్స్‌లో ఆకట్టుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన ట్రిబ్యూట్ పోస్టర్ ద్వారా అల్లు అర్జున్ పవన్ కల్యాణ్‌పై ఉన్న ప్రేమను, అభిమానాన్ని చాటుకున్నారు. మెగా అభిమానులు సైతం ఈ ఫొటోను సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ చేస్తూ పవన్‌కు బర్త్‌డే విషెస్ తెలియజేస్తున్నారు.











## కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ' టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. 'కన్నడ రాజ్య రామ రమణ.. మూరు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ' అనే పవర్‌ఫుల్ బిరుదులతో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించనున్నారు. ఈ పాన్ ఇండియా మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు.

## ఓటీటీలోకి పళ్ల బురుసు



సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం పళ్ళబురుసు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా నెలరోజుల్లోపే సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలంగాణ గ్రామీణ కథగా రూపొందింది. కథేంటంటే..: తెలంగాణలోని ఓ పల్లెటూరిలో ఉండే ఒంటరి వృద్ధుడు శంభు (సుధాకర్ రెడ్డి). పంటినొప్పితో ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ చికిత్స చేసి, కొన్ని మందులు రాసిస్తుంది. అలాగే పళ్ళు నొప్పి రాకుండా ఉండేందుకు వేపపుల్లతో కాకుండా టూత్ బ్రష్ వాడాలని చెబుతుంది. దీంతో ఆ పళ్ళ బురుసు (టూత్ బ్రష్) కొనిమ్మని తన కొడుకు తిరుపతి (మురళీధర్ గౌడ్)ని అడుగుతాడు. కానీ, ఆ కొడుకు వ్యక్తిగత సమస్యల్లో పడి తన తండ్రి మాటని నిర్లక్ష్యం చేస్తాడు. అది శంభుకి కోపాన్ని తెప్పిస్తుంది. సరిగ్గా అదే సమయంలో అతని కొడుకు తనని ఆహ్వానించకుండా మనవరాలి పెళ్లి జరిపించడంతో అవమాన భారంతో రగిలిపోతాడు. దీంతో పళ్ళ బురుసు కొనివ్వలేదన్న సాకుతో కొడుకుపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతాడు శంభు. ఇక అక్కడి నుంచి ఆ వివాదం జిల్లా కోర్టుకు చేరుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది కథ.




## రజనీ అభిమానులకు పండగ

### అక్టోబర్ 15న జైలర్`2 విడుదల

సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడినట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజనీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజనీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజనీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.